# మన జనప్రగతి

తెలుగు దినపత్రిక

నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం

సంపుటి : 6 సంచిక : 157 పేజీలు : 8 వెల : రూ.2/- శుక్రవారం 03 జులై 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool




## ఏపీ నుంచి అమలులోకి
# వీబీ జీ రామ్ జీ పథకం



● రైల్వే కోడూరు నుంచి పథకం ప్రారంభించిన కేంద్ర మంత్రి, సీఎం, డిప్యూటీ సీఎం ● వీబీజీ రామ్ జీతో రాష్ట్రాలకు రూ.7.5 లక్షల కోట్ల కేంద్ర నిధులు ● ప్రతీ గ్రామ పంచాయితీకి ఏడాదికి రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు ● వీబీ జీ రామ్ జీ పోర్టల్ ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ● వీబీ జీ రామ్ జీ పథకం భారం కాదు బాధ్యతన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

● మార్కెట్ ఇంటర్వెన్షన్ కింద తోతాపురి మామిడి కొనుగోళ్లకు కేంద్ర మంత్రి హామీ

● పీఎం ఆవాస్ యోజన, పీఎం గ్రామీణ్ సడక్ యోజన కింద రూ.422 కోట్ల నిధుల పత్రం అందజేత

**తిరుపతి,మన జనప్రగతి జూలై 02:** కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం వీబీ జీ రామ్ జీ ఏపీ నుంచి ప్రారంభమై దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. ఈ చారిత్రక ఘట్టానికి తిరుపతి జిల్లా రైల్వేకోడూరు వేదికైంది. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అజీవికా మిషన్' పథకాన్ని ఏపీ నుంచి ప్రారంభించారు. దీంతో దేశవ్యాప్తంగా ఈ పథకం అమల్లోకి వచ్చింది. ముక్కవారిపల్లి గ్రామంలో రూ. 4. 55 లక్షల వ్యయంతో ప్రతిపాదించిన మూడు పనుల్ని ముగ్గురు నేతలూ లాంఛనంగా ప్రారంభించారు. సామాజిక వర్షపు నీటి సంరక్షణ కుంట, మ్యాజిక్ మిగతా2లో...

## ఇండో పసిఫిక్‌లో శాంతి, భద్రతే
# ఉమ్మడి లక్ష్యం

### - భారత్, జపాన్ బంధం మరింత బలోపేతం

● జపాన్ ప్రధాని సనాయె తకాయిచి ● ఢిల్లీలో మోడీతో ద్వైపాక్షిక సమావేశం ● ఇరుదేశాల మధ్య పలు కీలక అవగాహనా ఒప్పందాలు



**న్యూఢిల్లీ ,మన జనప్రగతి జూలై 02:** భారత్, జపాన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగులు పడ్డాయి. భారత ప్రధాని మోడీ ఆహ్వానం మేరకు మూడు రోజుల అధికారిక పర్యటన కోసం భారత్‌కు వచ్చిన జపాన్ ప్రధాని సనాయె తకాయిచి గురువారం ఢిల్లీలో ప్రధాని మోడీతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. అనంతరం ఇరు దేశాల మధ్య పలు కీలక అవగాహనా ఒప్పందాలు జరిగాయి. ఈ సందర్భంగా జపాన్ ప్రధాని సనాయె తకాయిచి మాట్లాడుతూ స్వేచ్ఛా యుత, సుసంపన్నమైన, మిగతా2లో...



## శ్రీవారిని దర్శించుకున్న
# మంత్రి లోకేశ్

### - బ్రహ్మం చౌదరి, గౌతమిల నిశ్చితార్థానికి హాజరు

**తిరుమల,మన జనప్రగతి జూలై 02:** ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక మిగతా2లో...

# మావిగన్ మా రాజకీయ ఎజెండా

### ఇదే అంశంతో ఎన్నికలు వెళతాం
### మేనిఫెస్టోలనూ పెడతామన్న జగన్
### విజయవాడనే ఇప్పుడు రాజధాని అంటూ ప్రకటన
### జగన్ ప్రకటనలతో వైసిపిలో గందరగోళం



**విజయవాడ,మన జనప్రగతి జూలై 02:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని స్థాపన అంశంపై ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. మావిగన్ రాజధానిని తమ ఎజాండగా చేర్చామని, దీనితోనే ఎన్నికలకు వెళతామని ప్రకటించారు. దీనిని మేనిఫెస్టోలోనూ పెడతామని అన్నారు. ఇదో ఛాలెంజ్ అంటూ సవాల్ చేశారు. గత ఐదేళ్ల పాటు అమరావతిని కాదని, మిగతా2లో...



# అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

### తొలి బృందానికి చందర్‌కోట్ వద్ద స్వాగతం

**శ్రీనగర్,మన జనప్రగతి జూలై 02:** హిమాలయాల్లో వెలిసిన పవిత్ర అమర్‌నాథ్ హిమలింగ దర్శన యాత్ర ప్రారంభమైంది. క్షేత్ర దర్శనానికి బాల్తాల్ రూట్ లో వెళ్తున్న భక్తుల తొలి బృందానికి జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై ఉన్న చందర్‌కోట్ వద్ద ఘన స్వాగతం లభించింది. మిగతా2లో...

## కాంగ్రెస్ వర్సెస్
# బీఆర్ఎస్

● అధికార, ప్రతిపక్ష నేతల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు ● మాటల : గన్‌పార్క్ వద్దకు వచ్చిన మంత్రులు జూపల్లి, ● యుద్ధంతో : పొన్నం, అడ్లూరి, అజహరుద్దీన్ ● వేడెక్కిన తెలంగాణ భవన్ వద్ద తీవ్ర ఉద్రిక్తత గన్‌పార్క్‌కు వెళ్లేందుకు బీఆర్ఎస్ నేతల యత్నం

● రాజకీయం : హరీశ్‌రావు సహా పలువురి నాయకుల అరెస్టు



2లో

# కర్ణాటకలో ఘోర ప్రమాదం


● క్వారీలో కార్మికులపై దొర్లిపడ్డ బండరాయి ● ఏడుగురు కార్మికుల దుర్మరణం ● ఘటనపై సిఎం శివకుమార్ దిగ్భ్రాంతి



2లో

## పదవీవిరమణ వయసు
# 62 ఏళ్లకు పెంపు

### - కేబినేట్ నిర్ణయానికి అనుగుణంగా జివో జారీ



**అమరావతి,మన జనప్రగతి జూలై 02:** పీఎస్‌యూలు, కార్పొరేషన్లు, సొసైటీల ఉద్యోగులకు సంబంధించిన పదవీ విరమణ వయసును 60 ఏళ్ల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. గతంలో రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించిన తీర్మానానికి అనుగుణంగా సర్కార్ గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈ నిర్ణయం 2022 జనవరి 1 నుంచి రిట్రోస్పెక్టివ్‌గా అమలు కానుంది. అలాగే, 60 ఏళ్ల వయసులో పదవీ విరమణ పొందిన అర్హులైన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకునే అవకాశం ఉంది. మళ్లీ జాబ్‌లో చేరే వరకు ఉన్న గ్యాప్ పీరియడ్‌కు జీతం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. మిగతా2లో...

# మావిగన్ అంటే ఇక సున్నాకే పరిమితం

### జగన్‌ను హెచ్చరించిన మంత్రి గొట్టిపాటి



2లో

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా పంతం | అభివృద్ధి మా లక్ష్యం
03 - 07 - 2026

# ఏపీ నుంచి అమలులోకి వీబీ జీ రామ్ జీ పథకం





(మొదటి పేజీ తరువాయి)

డ్రెయిన్, మొక్కల పెంపకం కార్యక్రమాలను వీబీ జీ రామ్ జీ మిషన్ కింద తొలుత చేపట్టారు. ఈ పథకం కింద స్థానిక లబ్దిదారులకు కేంద్ర మంత్రి, సీఎం, డిప్యూటీ సీఎంలు కలిసి వీబీజీ రామ్ జీ జాబ్ కార్డులను అందజేశారు. కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేష్ పాశ్వాన్ లు వీబీ జీ రామ్ జీ ప్రోత్సాహక గీతాన్ని ఆవిష్కరించారు. ఈ పథకం కింద సమాచార బుక్ లెట్, కంపెండియం ఆఫ్ ఆర్టికల్స్ ను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విడుదల చేశారు. వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ ఆజివికా మిషన్ పోర్టల్ ను నేతలు ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..” వీబీ జి రామ్ జీ పథకం ఏపీలోని రైల్వే కోడూరు నియోజకవర్గం నుంచి ప్రారంభమై దేశవ్యాప్తంగా అమల్లోకి రావటం చారిత్రాత్మకం. గతంలో నరేగా రాయలసీమ ప్రాంతం నుంచే ప్రారంభమైంది. ఇప్పుడు కూడా వీబీజీ రామ్ జీ పథకం ఇక్కడి నుంచే ఆవిష్కృతం అయ్యింది. కేంద్రం నుంచి రూ.7,700 కోట్లు, రాష్ట్రం మరో రూ.4 వేల కోట్ల వ్యయంతో వీబీజీ రామ్ జీ కింద పనులు చేపడతాం. రూ.11 వేల కోట్ల పైచిలుకు మొత్తంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారధ్యంలో ఈ పథకం కింద గ్రామాల రూపు రేఖలు మారతాయి. 125 రోజుల పని దినాలతో గ్రామీణ అభివృద్ధికి కావాల్సిన ఏ పనైనా చేపట్టేందుకు వీబీజీ రామ్ జీ కింద అవకాశం కల్పిస్తోంది. రహదారులు, డ్రైనేజీలు, కాలువలు ఇలా వేర్వేరు ఆస్తుల కల్పనకు ఆస్కారం ఉండేలా ఈ పథకం వినియోగిస్తాం. జియో ట్యాగింగ్, బయోమెట్రిక్ లాంటి సాంకేతికతతో పూర్తి పారదర్శకంగా ఈ పథకం నిర్వహిస్తాం. గాలేరు నగరి నుంచి కోడూరుకు నీళ్లు తీసుకువస్తాం, జలధార ద్వారా భూగర్భ జలాలను కూడా పెంచుతాం. రాష్ట్రాలు వ్యయం చేసేలా ఈ పథకం చేపట్టటం భారం కాదు బాధ్యత. 13,226 గ్రామాల్లో ఒకే మారు గ్రామసభలు పెట్టి గిన్నిస్ రికార్డు సృష్టించిన ఘనత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కే దక్కింది. 7,000 కి.మీ. మేర సీసీ రోడ్లు, 40 వేల గోకులాలు, 15,500 నీటి తొట్టెలు, 1.07 లక్షల ఫార్మ్ పాండ్లు, 1,373 కి.మీ మేర గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, 1.66 లక్షల ఎకరాల్లో పండ్ల తోటల సాగు జరిగింది. ఉపాధి హామీ పనుల నిమిత్తం 55.44 కోట్ల పని దినాలు కల్పించి, రూ.16,695 కోట్లు ఖర్చు చేశాం. ఈ ఏడాది 10 వేల కి.మీ. గ్రావెల్ రోడ్లు, 1,500 కి.మీ. సిమెంట్, బీటీ రోడ్లు, 500 కి.మీ. మేజిక్ డ్రైన్లు, లక్ష ఎకరాల్లో పండ్ల తోటలు అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ముఖ్యంగా పొలాలకు వెళ్లే డొంక రోడ్లు కూడా జీ రామ్ జీ పథకం కింద నిర్మించవచ్చు”. అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. జల్ జీవన్ మిషన్ సహా 93 కేంద్ర ప్రాయోజిత పథకాలను గత పాలకులు నిర్వీర్యం చేస్తే వాటిని తిరిగి పునరుద్ధరించామని సీఎం అన్నారు. రూ.28 వేల కోట్లతో వివిధ పథకాలు చేపడుతున్నామని.. విధ్వంస మైన రాష్ట్రాన్ని నిలబెడతామని చెప్పి రెండేళ్లలో మాట నిలుపుకున్నామని వివరించారు.

సీఎం మాట్లాడుతూ “కేంద్రం అమరావతికి సహకారం అందించింది. వేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. గొడ్డలి పార్టీ రోజుకో మాట మాట్లాడుతోంది. ఎన్నికల ముందు ఓ మాట ఎన్నికలు అయ్యాక మరో మాట మాట్లాడారు. ఇప్పుడు మావిగన్ అంటూ కొత్త పాట పాడుతున్నారు. ఇది ఎవరికైనా అర్థం అయ్యిందా. అమరావతిని ఆపటం ఎవరి తరమూ కాదు. పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాల కంటే ముందే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. విశాఖ స్టీల్ ప్లాంట్ ను నిలబెట్టటంతో పాటు రైల్వే జోన్ సాధించాం. గూగుల్ డేటా సెంటర్ తో పాటు పుట్టపర్తిలో ఆమ్కా ఫైటర్ జెట్ తయారీ యూనిట్ వస్తోంది. రాయలసీమను అన్ని రంగాల్లోనూ అగ్రస్థానంలో నిలుపుతాం. దేశంలోనే ఉద్యాన పంటలకు కేంద్రం రాయలసీమ. త్వరలోనే రూ.40 వేల కోట్లతో ప్రభుత్వం, రూ.60 వేల కోట్ల ప్రైవేటు ప్రైవేటు పెట్టుబడులు తెస్తాం. మదనపల్లిలో హార్టీకల్చర్ హబ్ కు త్వరలోనే శంకుస్థాపన చేస్తాం. సత్యవేడులో హీరో మోటార్స్ సైకిళ్ల తయారీ యూనిట్ ఉంది. తిరుపతిలో బుల్లెట్ మోటార్ సైకిల్ తయారీ ప్లాంట్ వస్తోంది. ప్రజల మనిషి కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అడిగిన వెంటనే సమస్యల్ని పరిష్కరించారు. తోతాపురి మామిడి రైతులను ఆదుకునేందుకు, రహదారులు, పీఎంఏవై కోసం నిధులు ఇచ్చారు. దీనికి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. ఈ వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. స్వర్ణాంధ్ర ప్రదేశ్ గా ఏపీని తయారు చేయాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. బంగారం గనులు ఉన్న జొన్నగిరి పేరును చారిత్రక పేరు స్వర్ణ గిరిగా మార్చాం. నిస్వార్థంగా పనిచేసే కూటమి నేతలకు ప్రజలు సహకరించాలని కోరుతున్నాను. భారత మాతకు వికసిత్ భారత్ – తెలుగు తల్లికి స్వర్ణాంధ్ర సంకల్పం చేశాం. స్వర్ణాంధ్ర ప్రదేశ్ అన్ స్టాపబుల్. అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. **ఏపీకి నేను మేనమామ – కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్** సీఎం చంద్రబాబుతో కలిసి వీబీ జీ రామ్ జీ పథకం ప్రారంభించిన అనంతరం కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

దేశంలోని గ్రామాలను అభివృద్ధి చేసేందుకే వీబీజీ రామ్ జీ కింద రూ.7.5 లక్షల కోట్లు వ్యయం చేయాలని నిర్ణయించామని అన్నారు. ఈ 9 నెలల కాలానికి ఈ పథకం కింద ఏపీకి కేంద్రం నుంచి రూ.7,700 కోట్లు విడుదల చేస్తామని అన్నారు. స్వయంగా గ్రామ సభలే పంచాయితీలో పనుల్ని నిర్దేశించుకుంటాయని తెలిపారు. తనను మధ్యప్రదేశ్ లో అంతా మామాజీ అని పిలుస్తారని.. ఇప్పుడు ఏపీకి కూడా తాను మేనమామనే అయ్యానని మంత్రి వ్యాఖ్యానించారు. ఏ మేనమామ ఖాళీ చేతులతో రాడని.. ఏపీకి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 74,212 పక్కా ఇళ్లు, గ్రామీణ ప్రాంతాలను అనుసంధానించే రోడ్ల నిర్మాణానికి రూ.422 కోట్ల నిధులు ఇవ్వనున్నట్టు తెలిపారు.

# కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

**హైదరాబాద్,మన జనప్రగతి జూలై 02:** రాష్ట్రంలో రాజకీయం వేడెక్కింది. అధికార, ప్రతిపక్ష నేతల సవాళ్లు, ప్రతిసవాళ్లతో హైదరాబాద్ నగరం అట్టుడి కింది. నాయకుల మధ్య మాటల యుద్ధం నేపథ్యంలో గురువారం హైటెన్షన్ వాతావరణం నెలకొంది. రాష్ట్ర అప్పు, గురుకుల విద్యాసంస్థల టెండర్లలో అవినీతి అంశాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటలు తీవ్ర దుమారం రేపాయి. రైతాంగానికి ప్రభుత్వం చేసి న సంక్షమంపై చర్చకు సిద్ధమా? అని సీఎం రేవం త్‌రెడ్డి సవాల్ విసిరిన విషయం తెలిసిందే.ఆ సవాల్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వీకరించారు. తాను చర్చకు సిద్ధమనీ, స్థలం, తేదీ చెప్పాలని ప్రతి సవాల్ విసిరారు. రాష్ట్ర అప్పు రూ.3.50 లక్ష?ల కోట్లని ప్రకటించారు. దీనిపై స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు రాష్ట్ర అప్పులపై గణాంకాలతో సహా చెప్పేందుకు బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌కు గురువారం ఉదయం 11 గంటలకు వస్తానని అన్నారు. ఇంకోవైపు గురుకుల విద్యాసంస్థల టెండర్లలో రూ.రెండు వేల కోట్ల కుంభకోణం జరిగిందంటూ మాజీమంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు.దీన్ని సవాల్ చేస్తూ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, అజహరుద్దీన్ గురువారం ఉదయం 10 గంటలకే గన్‌పార్క్ వద్దకు చేరుకున్నారు. ఇదే సమయంలో తెలంగాణ భవన్‌కు కేటీఆర్, హరీశ్‌రావు వచ్చారు. అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లా డుతూ గురుకుల విద్యాసంస్థల టెండర్లలో ఎలాంటి అవినీతి జరగలేదన్నారు. పూర్తి వివరాలతో ఇక్కడికి వచ్చామని చెప్పారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కాకుండా మాజీ మంత్రి హరీశ్‌రావు గన్‌పార్క్ వద్దకు రావాలని సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను స్వీకరించిన హరీశ్‌రావు గన్‌పార్క్ వద్దకు వచ్చేందుకు యత్నించారు. కారులో కూర్చోగానే పోలీసులు అడ్డుకున్నారు.

# మావిగన్ అంటే ఇక సున్నాకే పరిమితం

**• జగన్‌ను హెచ్చరించిన మంత్రి గొట్టిపాటి**



**అమరావతి,మన జనప్రగతి జూలై 02:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రాజధానుల పేరుతో ఎన్నికలకు వెళ్తే వైసీపీకి 11 సీట్లు వచ్చాయని.. ఇప్పుడు మావిగన్ అనే పిచ్చిచేష్టలతో ఎన్నికలకు వెళ్తే సున్నాకే పరిమితం అవుతారంటూ వ్యాఖ్యానించారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో మంత్రి పాల్గొ?న్నారు. అనంతరం మాట్లాడుతూ.. జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేయాలనే లక్ష్యంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మూడు రాజధానుల పేరుతో ఒక్క ఇటుక కూడా పెట్టకుండా.. రూ.450 కోట్లు ఖర్చుపెట్టి తన కోసం ప్యాలెస్ నిర్మించుకున్నారని ఆరోపించారు. అమరావతి నిర్మాణ పనులు వేగవంతంగా జరుగు తున్నాయని చూసి ఓర్చుకోలేక జగన్ విషం కక్కారని మంత్రి వ్యాఖ్యానించారు. అమరావతిపై తనకు ఎటువంటి వ్యతిరేకతలేదని.. 33000 ఎకరాలు కావాలని చెప్పిన వ్యక్తి జగన్ అని గుర్తుచేశారు. అమరావతి లోనే ఇల్లు కట్టుకున్నానని ఆనాడు ప్రజల్ని నమ్మించారన్నారు. అందుకే ప్రజలు నీకు బుద్ధి చెప్పి 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు సాధించేందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలూ కష్టపడుతున్నారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు.



# పదవీవిరమణ వయసు 62 ఏళ్లకు పెంపు

(మొదటి పేజీ తరువాయి)

గ్యాప్ పీరియడ్‌ను సీనియారిటీ, ప్రమోషన్ల కోసం పరిగణనలోకి తీసుకోరని పేర్కొంది. కోర్టు ఆదేశాల మేరకు 62 ఏళ్ల వరకు పనిచేసిన ఉద్యోగులకు పూర్తి స్థాయి సర్వీస్ బెనిఫిట్స్ అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 60 ఏళ్లకు పదవీ విరమణ పొంది తిరిగి విధుల్లో చేరేందుకు ఆసక్తి లేని ఉద్యోగులకు పాత నిబంధనల ప్రకారమే రిటైర్మెంట్ వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయాన్ని అమలు చేసేందుకు సర్వీస్ రూల్స్‌లో అవసరమైన సవరణలు చేయాలని సంస్థలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే ప్రతి సంస్థ తమ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించింది. అన్ని శాఖలు తమ పరిధిలోని పీఎస్‌యూలు, కార్పొరేషన్లు, సొసైటీలకు వెంటనే ఉత్తర్వులను పంపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

# ఇండో పసిఫిక్‌లో శాంతి, భద్రతే ఉమ్మడి లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనల ఆధారిత ఇండో–పసిఫిక్ ప్రాంత నిర్మాణం భారత్, జపాన్ ఉమ్మడి లక్ష్యమని స్పష్టం చేశారు. ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, అభివృద్ధికి దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్, జపాన్ కూడా ఉన్నాయని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, మార్కెట్ ఆర్థిక వ్యవస్థలను విశ్వసించే దేశాలుగా రెండు దేశాలు కలిసి అనేక కీలక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాయని చెప్పారు. ఈ కార్యక్రమాల ద్వారా ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రత, ఆర్థిక పురోగతి మరింత బలపడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రధాని మోడీ తనను ‘అందమైన చెల్లెలు’గా సంబోధించడం సంతోషంగా అనిపించిందని తకాయిచి చెప్పారు. భారత్‌తో జపాన్‌కు ఉన్న ప్రత్యేక సంబంధాలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయని అన్నారు. ఇటీవల తాము నవీకరించిన “ఫ్రీ అండ్ ఓపెన్ ఇండో–పసిఫిక్” ( ఎఫ్ ఓఐపీ) విధానానికి అనుగుణంగా భారత్‌తో వ్యూహాత్మక సహకారాన్ని మరింత విస్తరించేందుకు అంగీకరించినట్లు వెల్లడించారు.

# శ్రీవారిని దర్శించుకున్న మంత్రి లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)

పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, ఆంధ్రప్రదేశ్ మరింత అభివృద్ధి సాధించాలని స్వామివారిని ప్రార్థించినట్లు మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. అనంతరం తిరుపతిలోని భూపాల్ హౌసింగ్ కాలనీలో తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ కే. గౌతమి శ్వేత నివాసాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏపీ కమ్మ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి, కే. గౌతమి శ్వేతలను మంత్రి లోకేశ్ ఆశీర్వదించారు. వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్న ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతూ వారి ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షించారు. మంత్రి నారా లోకేశ్ సమక్షంలో నాదెండ్ల బ్రహ్మం చౌదరి, గౌతమి శ్వేతలు ఉంగరాలు మార్చుకుని నిశ్చితార్థ వేడుకను నిర్వహించారు. మంత్రి లోకేశ్ ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివాహానికి ముందు జరిగిన ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. పలువురు టీడీపీ నేతలు, పార్టీ కార్యకర్తలు కూడా హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతుల జీవితంలో ఈ శుభ ఘట్టం చిరస్మరణీయంగా నిలవాలని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు. రాత్రి తిరుమలలోని శృంగేరీ శారద పీఠంలో నాదెండ్ల బ్రహ్మం చౌదరి, గౌతమి శ్వేతల వివాహం జరగనుంది. ఈ వివాహ వేడుకకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు.

# మావిగన్ మా రాజకీయ ఎజెండా

(మొదటి పేజీ తరువాయి)

వికేంద్రీకరణెళి ధ్యేయంగా 'మూడు రాజధానుల' విశాఖపట్నం, అమరావతి, కర్నూలు నినాదంతో ముందుకు సాగి, అదే ఎజెండాతో ఎన్నికలకు వెళ్లిన ఆ పార్టీ ఓటమి తర్వాత తన వ్యూహాన్ని మార్చింది. ఇటీవల మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు ప్రాంతాల కలయికగా 'మావిగన్' సరికొత్త రాజధాని ప్రతిపాదనను జగన్ తెరపైకి తెచ్చారు. అయితే, నిన్నటి వరకు 'మావిగన్' నినాదంతోనే ముందుకు వెళ్తామని చెప్పిన జగన్, తాజాగా 'విజయవాడే ఆంధ్రప్రదేశ్ రాజధాని' అంటూ సంచలన ప్రకటన చేయడం రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేసింది. ఈ వరుస మార్పులతో అసలు రాజధాని విషయంలో వైసిపి అంతర్గత వ్యూహం ఏంటనే దానిపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.రాజధాని మార్పులపై అధినేత జగన్ ఒకదాని తర్వాత ఒకటిగా మారుస్తున్న ప్రకటనలతో సొంత పార్టీ నేతలు, శ్రేణులే తీవ్ర గందరగోళంలో పడ్డారు. దీనిపై వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ స్పందిస్తూ.. జగన్ పేర్కొన్న 'మావిగన్' లేదా విజయవాడ ప్రతిపాదనలు పార్టీ అధికారిక నిర్ణయం కాదని, ప్రస్తుత ప్రభుత్వానికి తాము ఇస్తున్న ఒక సూచన మాత్రమేనని సర్దుబాటు చేసే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ, మూడు రాజధానుల ముచ్చటను వదిలేసి, ఇప్పుడు కృష్ణా–గుంటూరు జిల్లాల వైపు జగన్ మొగ్గు చూపడం వెనుక భవిష్యత్తు రాజకీయ సమీకరణాలు దాగి ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. రాజధానిపై స్పష్టమైన ఏకాభిప్రాయం లేకపోవడం, రోజుకో మాట మారుస్తుండటంతో అధికార పక్షం కూటమి నేతలు వైసీపీ వైఖరిని తీవ్రంగా తప్పుబడుతున్నారు.

# అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

రాంబన్ జిల్లా యంత్రాంగం, సివిల్ సొసైటీ సభ్యులు, వివిధ సంస్థలు భక్తులకు ఆత్మీయ ఆతిథ్యంతో స్వాగతం పలికాయి. అంతకుముందు, జమ్మూలోని భగవతీ నగర్ బేస్ క్యాంప్ నుంచి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈ వార్షిక యాత్ర కాన్వాయ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. భక్తులను స్వాగతించిన వారిలో డీఐజీ సర్గూన్ శుక్లా, రాంబన్ డిప్యూటీ కమిషనర్ మహమ్మద్ అలియాస్ ఖాన్, ఎస్ఎస్పీ అరుణ్ గుప్తా, ట్రాఫిక్ ఎస్ఎస్పీ రాజా ఆదిల్ హమీద్ సహా పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. తర్వాత, భక్తులు బస చేసే మొదటి ప్రధాన కేంద్రం చందర్‌కోట్. ఈ పవిత్ర యాత్ర సాఫీగా, సురక్షితంగా సాగేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల చర్యలు చేపట్టింది. చందర్‌కోట్ లంగర్ సైట్ వద్ద భక్తులకు అవసరమైన వసతులు, భోజన సదుపాయాలను సిద్ధం చేశారు. పోలీస్, ఆర్మీ, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ , ట్రాఫిక్ పోలీస్, ఆరోగ్య శాఖ, సర్వీసెస్ వంటి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.

# కర్ణాటకలో ఘోర ప్రమాదం

**బెంగళూరు,మన జనప్రగతి జూలై 02:**కర్ణాటకలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బెంగళూరు దక్షిణ తాలూకాలోని మద పట్టణంలో గురువారం భారీ బండరాయి కార్మికులపై పడటంతో ఏడుగురు కార్మికులు మృతిచెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఓ స్టోన్ క్రషర్ కంపెనీలో కూలీలు పనులు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులను బిహార్‌కు చెందిన వలస కూలీలుగా పోలీసులు గుర్తించారు. ప్రమాదం జరిగిన సమయంలో క్వారీలో సుమారు 15 నుంచి 20 మంది కార్మికులు ఉన్నారని వారు తెలిపారు. కొత్త క్రషర్ యూనిట్ ఏర్పాటు కోసం దాదాపు 100 అడుగుల ఎత్తులో ఒక హిటాచీ యంత్రం పని చేస్తోందని పోలీసులు వెల్లడించారు.

ఈ సందర్భంగా ఒక పెద్ద బండరాయి జారి కింద ఉన్న కార్మికులపై పడిందని పోలీసులు వివరించారు. దీంతో ఏడుగురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. క్షతగాత్రులను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. శిథిలాలను తొలగించి చిక్కుకుపోయిన కార్మికులను రక్షించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. మరోవైపు బాధిత కుటుంబాలకు సమాచారం అందించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. క్వారీలో నిర్లక్ష్యం లేదా భద్రతా నిబంధనల ఉల్లంఘన జరిగిందా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రమాదంపై కర్ణాటక సీఎం శివకుమార్ స్పందిస్తూ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు ఈ దుఃఖాన్ని తట్టుకునే శక్తి లభించాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికుల భద్రత, రక్షణ అనేది క్వారీ యజమానుల బాధ్యత అని ముఖ్యమంత్రి నొక్కిచెప్పారు. భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు తేలిన క్వారీలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని సీఎం శివకుమార్ హెచ్చరించారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
03 - 07 - 2026

# ముమ్మరంగా తాగునీటి నాణ్యత పరీక్షలు

### - ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి: శ్రీనివాస్ ఆచారి



**ఆదోని మన జనప్రగతి జూలై 02:-**వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టే లక్ష్యంతో ఆదోని పట్టణంలోని 19వ వార్డు ఎల్ఐసీ కాలనీలో తాగునీటి నాణ్యత, క్లోరినేషన్ పరీక్షలను మున్సిపల్ అధికారులు నిర్వహించారు.మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని టీడీపీ వార్డు ఇన్‌చార్జి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ ఆచారి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ ఆచారి మాట్లాడుతూ, వర్షాకాలంలో నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాగునీటిని తప్పనిసరిగా కాచి, వడపోసుకుని వినియోగించాలని తెలిపారు. పరిశుభ్రత పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని చెప్పారు.పరీక్షల అనంతరం అధికారులు నీటి నాణ్యత సంతృప్తికరంగా ఉందని, ప్రస్తుతం తాగునీరు సురక్షితంగా ఉందని కాలనీ వాసులకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది చంద్ర, లైన్‌మన్ వంశీ,కాలనీ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కొట్టాన్ని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

### - రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్





**దేవనకొండ మన జనప్రగతి జూలై 02:-**దేవనకొండ మండలం బేతపల్లి గ్రామానికి చెందిన చాకలి మహాదేవమ్మ కొట్టాన్ని కూల్చేందుకు ప్రయత్నించిన వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి. రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...మహాదేవమ్మ గత 70 ఏళ్లుగా ఆ స్థలంలో నివాసం ఉంటున్నారని, ఆమెకు సంబంధిత హక్కు పత్రాలు ఉన్నప్పటికీ అదే గ్రామానికి చెందిన పోలీసు సురేష్ కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.తన ఇంటికి అడ్డుగా ఉన్న కొట్టాన్ని తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశంతో రాజకీయ, ఆర్థిక పలుకుబడిని ఉపయోగించి జేసీబీతో కొట్టాన్ని కూల్చేందుకు ప్రయత్నించారని తెలిపారు. ఈ ఘటనలో డిప్యూటీ ఎంపీడీవో గోపాల్, పంచాయతీ కార్యదర్శి సునందిని సహా సంబంధిత అధికారుల పాత్రపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మహాదేవమ్మ కుటుంబ సభ్యులు అడ్డుకోవడంతో కూల్చివేత నిలిచిపోయిందని, ఆమెను బెదిరించడం, అసభ్యంగా మాట్లాడడం వల్ల ఆత్మహత్యాయత్నానికి పాల్పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెకు ఏదైనా అపాయం జరిగితే పోలీసు సురేష్‌తో పాటు సంబంధిత అధికారులే బాధ్యత వహించాలని అన్నారు.జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని మహాదేవమ్మకు న్యాయం చేయాలని, దౌర్జన్యానికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోటకొండ సూరి, నాయకులు బడే సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# 2016 దోపిడీ కేసులో తుది తీర్పు.. ముగ్గురు నిందితులకు కారాగార శిక్ష

- కత్తితో బెదిరించి వాహనం, నగదు అపహరించిన కేసులో దోషులుగా నిర్ధారణ
- కడప అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు తీర్పు



**తొండూరు మన జనప్రగతి జూలై 02:-**దశాబ్దం క్రితం నమోదైన సంచలన దోపిడీ కేసులో న్యాయస్థానం తుది తీర్పు వెలువరించింది. కత్తులతో బెదిరించి వాహనాన్ని అడ్డగించి నగదు, సెల్‌ఫోన్లు దోచుకున్న కేసులో ముగ్గురు నిందితులను దోషులుగా నిర్ధారించిన కడప అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారికి రెండున్నరేళ్ల కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.3 వేల జరిమానా విధించింది.పోలీసుల వివరాల ప్రకారం..అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని ఎస్టీ కాలనీకి చెందిన ఆంజనేయులు తన సహచరులతో కలిసి 2016 ఫిబ్రవరి 6న టాటా ఏస్ వాహనంలో ప్లాస్టిక్ కుర్చీలు విక్రయించి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా, ముద్దనూరుపులివెందుల ప్రధాన రహదారిలోని మల్లెల ఘాట్ వద్ద రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో కొందరు దుండగులు వాహనాన్ని అడ్డగించారు. కత్తులతో బెదిరించి వాహనం అద్దాలను ధ్వంసం చేయడంతో పాటు కట్టెలతో దాడి చేసి గాయపరిచారు. అనంతరం రూ.62 వేల నగదు, సెల్‌ఫోన్లు అపహరించి పరారయ్యారు.బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి తొండూరు ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేయగా,అప్పటి సీఐ రవిబాబు,ఎస్ఐ శ్రీనివాసులు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు.విచారణ అనంతరం నేరం రుజువుకావడంతో నిందితులు సాతుపాటి సుధాకర్, మేంద్రగుత్తి సురేష్, మేంద్రగుత్తి గోవిందులకు కడప అదనపు సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి జి.సి. అసిఫా సుల్తానా రెండున్నరేళ్ల కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.3 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.అయితే విచారణ సమయంలో నిందితులు కోర్టుకు హాజరు కాకపోవడంతో నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ అయ్యాయి.పులివెందుల ఎస్డీపీఓ మురళీనాయక్, పులివెందుల రూరల్ సీఐ శాంతిలాల్ పర్యవేక్షణలో తొండూరు ఎస్ఐ బి. ఘన మద్దిలేటి,పోలీసు సిబ్బంది పీసీ ఎం.సిద్ధారెడ్డి,హెచ్‌జీ గోవర్ధన్‌లు మూడేళ్లుగా పరారీలో ఉన్న నిందితులను గుర్తించి అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.ఈ కేసులో ఏఎస్ఐ కె.శ్రీనివాసులు,కోర్టు మానిటరింగ్ సెల్ హెచ్‌సీ వెంకటేశ్వర్లు సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరుపరచి కేసు పురోగతికి కృషి చేశారు. ప్రభుత్వ అభియోజకుడు (ఏపీపీ) బొక్సం శ్రీనివాసులు సమర్థవంతంగా వాదనలు వినిపించడంతో నిందితులకు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

# అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా చర్యలు తీసుకోవాలి

### ప్రతి బీఎల్ఓ తమ పరిధిలోని ఓటర్లలో రోజుకు కనీసం 10 శాతం మేర డిజిటైజేషన్ పురోగతి నమోదు చేయాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 02:-**అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక జమ్మిచెట్టు వద్ద ఉన్న గడ్డ వీధి 244, 245 పోలింగ్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న డిజిటైజేషన్ ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా బూత్ లెవల్ అధికారులు సేకరించిన సమాచారాన్ని యాప్ లో డిజిటైజేషన్ చేస్తున్న విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అత్యంత జాగ్రత్తగా డిజిటైజేషన్ ప్రక్రియను నిర్వహించాలన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి బీఎల్ఓ తమ పరిధిలోని ఓటర్లలో రోజుకు కనీసం 10 శాతం మేర డిజిటైజేషన్ పురోగతి నమోదు చేయాలన్నారు. ఓటర్లు అందుబాటులో ఉండే సమయాల్లో ఇంటింటికీ వెళ్లి అవసరమైన ఫోటోలు, పత్రాలు, ఇతర వివరాలను సేకరించి, డిజిటైజేషన్ కు సంబంధించి నిర్ణీత లక్ష్యాన్ని సాధించాలన్నారు. నిర్దేశించిన గడువు లోపు 100 శాతం డిజిటైజేషన్ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బూత్ లెవల్ ఆఫీసర్లు డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. బూత్ లెవల్ ఏజెంట్లు బూత్ లెవల్ ఆఫీసర్లతో సమన్వయంతో వ్యవహరించి క్షేత్రస్థాయిలో చురుకుగా పని చేయాలన్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. అనంతరం కలెక్టర్ స్వయంగా బి ఎల్ ఓ యాప్ లో ఎన్యూమరేషన్ ఫార్మ్స్ ను డిజిటైజేషన్ చేశారు. కార్యక్రమంలో డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, అదనపు మున్సిపల్ కమిషనర్ కృష్ణ, ఎన్నికల విభాగం సూపరిశీటెండెంట్ మురళి, తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో శ్రామికుల వేతనాలు తెలంగాణ కంటే మెరుగ్గా అమలు: ఎంపీ బస్తిపాటి నాగరాజు







**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 02:-**గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తరించి, సమగ్ర గ్రామాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు అన్నారు. వికసిత్ భారత్‌గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవికా మిషన్ (జీ రామ్‌జీ) కార్యక్రమంలో భాగంగా గురువారం వెల్దుర్తి మండల కేంద్రంలో జిల్లాస్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ బస్తిపాటి నాగరాజుతో పాటు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి కార్యక్రమాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పలు సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. ఈ పథకంలో 60 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం, 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తున్నాయని తెలిపారు.గ్రామీణ పేదలకు మరింత ఉపాధి కల్పించే ఉద్దేశంతో పనిదినాలను 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచడంతో పాటు శ్రామికుల రోజువారీ వేతనాలను కూడా పెంచామని చెప్పారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న వేతనాలు తెలంగాణ కంటే మెరుగ్గా ఉన్నాయని పేర్కొన్నారు.కర్నూలు జిల్లా వెనుకబడిన ప్రాంతం కావడంతో అధిక సంఖ్యలో కొత్త జాబ్ కార్డులు మంజూరు చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పనిచేస్తోందని అభినందించారు.ముందుగా తిరుపతి జిల్లా ముక్కవారిపల్లిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రారంభించిన కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. అనంతరం కలెక్టర్ కేక్ కట్ చేసి శ్రామికులకు పంపిణీ చేయడంతో పాటు ప్రదర్శన స్టాల్స్‌ను సందర్శించారు.ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ నరసింహారెడ్డి, ఆర్డీఓలు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పులివెందులలో అత్యాధునిక 'కమాండ్ & కంట్రోల్ సెంటర్'

### కమాండ్ & కంట్రోల్ సెంటర్ ప్రారంభించిన డిఐజి

### డా.కోయ ప్రవీణ్ మరియు కడప జిల్లా ఎస్పీ షెల్కె నచికేత్ విశ్వనాథ్





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 02:-**ప్రజల భద్రత,శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నివారణే ధ్యేయంగా పులివెందుల పోలీస్ స్టేషన్ ప్రథమ అంతస్తులో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన పులివెందుల కమాండ్ & కంట్రోల్ సెంటర్ ప్రారంభానికి సిద్ధమైంది.వైఎస్ఆర్ కడప జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ నచికేత్ విశ్వనాథ్, సూచనల మేరకు ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపకల్పన చేశారు.ఈ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను గురువారం కర్నూలు రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (DIG) డా. కోయ ప్రవీణ్, మరియు కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, ముఖ్య అతిథులుగా విచ్చేసి అధికారికంగా ప్రారంభించారు.ఈ ప్రాజెక్టు మౌలిక వసతులు, సీసీ కెమెరాల ఏర్పాటు,పబ్లిక్ అడ్రస్ స్పీకర్ వ్యవస్థ, నెట్‌వర్కింగ్,విద్యుత్ సౌకర్యాల కోసం మొత్తం రూ.32,62,495/- వ్యయం అవుతుందని అంచనా వేశారు. పులివెందుల పట్టణ ప్రజలు, వివిధ వ్యాపార సంస్థలు, దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు అందించారు.మొత్తం నగదు విరాళాలు రూ. 16,95,000/-,55 అంగుళాల నాణ్యమైన టీవీలు 06,ఎయిర్ కండిషనర్లు (AC\T) 03,పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి ఏ బి.టెక్ రవి సహకారంతో పులివెందుల మున్సిపాలిటీ వారు ప్రజా భద్రతకు ప్రాధాన్యతనిస్తూ రూ.12,00,000/- ఆర్థిక సహాయాన్ని అందించారు.9 ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల నిఘాపులివెందుల పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లో సుమారు 35 కిలోమీటర్ల పరిధిలోని 9 ప్రధాన కూడళ్లలో అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఈ సెంటర్‌కు అనుసంధానించారు.24ఐ7 ఈ కెమెరాల ద్వారా నిఘా కొనసాగుతుంది.కడప రింగ్ రోడ్ సర్కిల్ (చందమామ డాబా కూడలి)కడప రోడ్డులోని శ్రీ కృష్ణ ఆలయం సమీప కూడలి,ఆలవలపాడు కూడలి,వి.ఎన్.పల్లి కూడలి,ముద్దనూరు రింగ్ రోడ్ మార్కెట్ యార్డ్ సమీప కూడలి,పర్నపల్లి రింగ్ రోడ్ కూడలి,టీడీపీ కార్యాలయం కూడలి,అంబకాపల్లి కూడలికదిరి రోడ్డు కూడలి (9 కూడళ్లు)పబ్లిక్ అడ్రస్ స్పీకర్ వ్యవస్థ ప్రజలకు అత్యవసర హెచ్చరికలు,ట్రాఫిక్ సూచనలు,తప్పిపోయిన వారి వివరాలు మరియు పోలీస్ శాఖ ప్రకటనలను వెంటనే చేరవేయడానికి పట్టణంలోని 9 ముఖ్య ప్రాంతాలలో స్పీకర్ వ్యవస్థను పాత బస్ స్టాండ్,శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం సమీపం,పాత పంచాయతీ కార్యాలయం,పూల మార్కెట్ సర్కిల్,పర్నపల్లి బస్ స్టాప్, కోర్టు సర్కిల్,ఆర్టీసీ బస్ స్టాప్,కదిరి బస్ స్టాప్,బాలికల ప్రభుత్వ కళాశాల వద్ద ఏర్పాటు చేశారు.ఈ కేంద్రం 24ఐ7 నిరంతరం పనిచేస్తుంది.దీనిలో ఒక ఇంచార్జ్ అధికారి,ముగ్గురు మహిళా పోలీస్ కానిస్టేబుళ్లు ఇద్దరు మోటార్ సైకిళ్లు కలిగిన నలుగురు పోలీసు సిబ్బంది అత్యవసర సమాచారంపై వెంటనే స్పందిస్తారు.అలాగే శాంతిభద్రతల పర్యవేక్షణ,జనసమ్మర్ద నియంత్రణ కోసం కింద పేర్కొన్న నాలుగు పరిధులలో డ్రోన్లను వినియోగిస్తారు.పులివెందుల సబ్-డివిజన్ డి.ఎస్.పి. గా బుక్కే మురళి నాయక్ బాధ్యతలు నిర్వహించిన కాలంలో,ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు పోలీస్ స్టేషన్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు.చక్రాయపేట, సింహాద్రిపురం లింగాల పోలీస్ స్టేషన్లు,సిబ్బంది మరియు ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఆయా పోలీస్ స్టేషన్ల ఆవరణలో బోర్ వెల్స్ ఏర్పాటు చేశారు.వేంపల్లి పోలీస్ స్టేషన్ భద్రతను మరింత బలోపేతం చేయుటకు పోలీస్ స్టేషన్ చుట్టూ పహారా (ప్రహరీ) గోడ నిర్మించారు.లింగాల & పులివెందుల పోలీస్ స్టేషన్లు సుమారు రూ.5.00 లక్షల వ్యయంతో పోలీస్ స్టేషన్ల యొక్క మరమ్మత్తు పనులు చేపట్టారు.ఈ అభివృద్ధి కార్యక్రమాల అమలులో కూడా టీడీపీ ఇన్‌ఛార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి ఏ బి.టెక్ రవి విశేష సహకారం అందించడం జరిగిందని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సబ్-డివిజన్ లోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు,సబ్ ఇన్‌స్పెక్టర్లు మరియు పోలీస్ సిబ్బంది విశేషంగా కృషి చేశారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
03 - 07 - 2026

## డెంగ్యూపై అపోహలు వీడాలి.. పరిశుభ్రతతోనే నివారణ



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 02:-**డెంగ్యూ వ్యాధిపై అపోహలకు తావివ్వకుండా ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, ఇళ్ల చుట్టూ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. సిద్ధవటం ఎస్టీ కాలనీలో డెంగ్యూ మాసోత్సవాల సందర్భంగా దోమల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్వైజర్ మౌలాలి మాట్లాడుతూ, పి. కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రంగలక్ష్మి ఆధ్వర్యంలో ప్రజలకు డెంగ్యూ నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనరసమ్మ, హెల్త్ సూపర్వైజర్లు శారదాదేవి, మౌలాలి, హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## భేటీ బచావో బేటీ పఢావోపై అవగాహన కార్యక్రమం



**తొండూరు మన జనప్రగతి జూలై 02:-**మండల పరిధిలోని మల్లెల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల విద్య, భద్రత, ఆరోగ్యంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, వాటి నివారణకు అమలులో ఉన్న చట్టాల గురించి వివరించారు. అలాగే యుక్తవయసులో పోషకాహారం తీసుకోవడం, హిమోగ్లోబిన్ స్థాయిని పెంచే ఆహార పదార్థాలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండడం, బాలికల అభివృద్ధికి వారిలోనే సానుకూల మార్పు రావాల్సిన అవసరాన్ని తెలియజేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పట్ల గౌరవం, విధేయత కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్వైజర్, మహిళా పోలీసు సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ పదవులకు దరఖాస్తుల నమోదు నేడు

- పులివెందుల నియోజకవర్గ నాయకులకు అవకాశం
- కార్యక్రమంలో పాల్గొనాలని దాసరి రవిశంకర్ పిలుపు



**వేంపల్లె మన జనప్రగతి జూలై 02:-**పులివెందుల నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పార్టీ పదవుల కోసం దరఖాస్తులు నమోదు చేసుకునేందుకు నేడు (శుక్రవారం) కడప హరిత హోటల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కడప పార్లమెంట్ జనసేన పార్టీ నిర్మాణ సమాచార సేకరణ కమిటీ సభ్యుడు దాసరి రవిశంకర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ నమోదు ప్రక్రియ కొనసాగుతుందని ఆయన వెల్లడించారు. జనసేన పార్టీలో వివిధ పదవులకు ఆసక్తి ఉన్న నాయకులు, కార్యకర్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తుతో పాటు జనసేన పార్టీ ఐడీ కార్డు జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ఒక పాస్‌పోర్ట్ సైజు ఫోటో తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. సంబంధిత వారందరూ నిర్ణీత సమయంలో హాజరై తమ దరఖాస్తులను నమోదు చేసుకోవాలని దాసరి రవిశంకర్ విజ్ఞప్తి చేశారు.

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు అతికారి కృష్ణ ఘన స్వాగతం



**సిద్దవటం మన జనప్రగతి జూలై 02:-**విబిజీరాంజీ గ్రామీణ పథకం ప్రారంభోత్సవం సందర్భంగా రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లె మండలం ముక్కవారిపల్లిలో నిర్వహించిన సభకు విచ్చేసిన జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్కు రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త, సిద్దవటం మండలానికి చెందిన అతికారి కృష్ణ సభా ప్రాంగణంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఉప ముఖ్యమంత్రిని ఆప్యాయంగా పలకరించి, రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అతికారి కృష్ణ మాట్లాడుతూ, "గ్రామీణాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు గ్రామాల రూపురేఖలను మార్చే దిశగా దోహదపడతాయి. జనసేన పార్టీ ప్రజా సేవే లక్ష్యంగా ప్రభుత్వంతో కలిసి అభివృద్ధి కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తుంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు మరింత చేరువై సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలి" అని పేర్కొన్నారు.


## ఉపాధి హామీ పనిదినాలు 125కు పెంపు..

### - సిద్ధవటంలో కూలీల సంబరాలు



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 02:-**గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిదినాలను 100 నుంచి 125 రోజులకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడంతో సిద్ధవటం మండలంలోని ఉపాధి కూలీలు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని 18 గ్రామాలకు చెందిన సుమారు 800 మంది కూలీలు స్వీట్లు పంచుకుని సంబరాలు నిర్వహించారు. కడపచెన్నై జాతీయ రహదారిపై కనుమలోపల్లి సమీపంలో కందకాల పనులు చేస్తున్న కూలీలు మాట్లాడుతూ, పనిదినాల పెంపుతో తమ కుటుంబాలకు మరింత ఉపాధి భరోసా లభిస్తుందని తెలిపారు. అలాగే హార్టికల్చర్ పనుల ద్వారా రైతుల పొలాల్లో మొక్కలు నాటే అవకాశాలు కల్పించడం, కూలి రేట్లు పెంచడం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఏపీవో నరసింహులు మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల పండ్ల తోటల అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. ప్రతి కూలీ పనికి వెళ్లే ముందు, పని ముగిసిన తర్వాత తప్పనిసరిగా మ్యాపింగ్ చేయించుకోవాలని సూచించారు. అలా చేస్తే కూలి మొత్తాలు నేరుగా ఖాతాల్లో జమ అవుతాయని, ఇకపై ప్రతి 15 రోజులకు ఒకసారి వేతనాలు చెల్లించే విధానం అమల్లో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ వేణు, ఫీల్డ్ అసిస్టెంట్లు పుల్లయ్య, కృష్ణవేణి, మేటీలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## సుద్దల కృష్ణప్ప ప్రథమ వర్ధంతి.. అంధుల ఆశ్రమంలో అన్నదానం






**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 02:**పులివెందుల పట్టణంలోని కచేరీ రోడ్డు,గీత మందిరం పక్కన ఉన్న శ్రీ వీరనారాయణ స్వామి అంధుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పుట్టపర్తి జిల్లా, ధర్మవరం నియోజకవర్గం, ముదిగుబ్బ మండలం, దొరిగిల్లు పంచాయతీ, నాగలగుబ్బల గ్రామానికి చెందిన కీర్తిశేషులు సుద్దల కృష్ణప్ప ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కృష్ణప్ప ధర్మపత్ని సుద్దల అనసూయమ్మ మాట్లాడుతూ తమ కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న కృష్ణప్ప రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడం తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుమారుడు మల్లికార్జున దివ్యంగుడు (మూగవాడు) అని,జీవితంలో ఎన్ని సమస్యలు ఎదురవుతున్నప్పటికీ,తమ కుటుంబం తరఫున కొంతమందికైనా ఆకలి తీర్చాలనే సంకల్పంతో ఈ అన్నదానం చేపట్టినట్లు తెలిపారు. ఆశ్రమంలోని అంధుల ఆశీస్సులు,ప్రార్థనల ద్వారా కృష్ణప్ప పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆమె ఆకాంక్షించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో సుద్దల కుటుంబ సభ్యులు మోహన్,అంజిలతో పాటు ఆశ్రమ నిర్వాహకులు అనిమేల రామమోహన్ మరియు ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు. కుటుంబ సభ్యుల సేవా గుణాన్ని ఆశ్రమ నిర్వాహకులు ఈ సందర్భంగా అభినందించారు.

## వైభవంగా శ్రీ చిన్న గంగమ్మ తల్లి ఆలయ శంకుస్థాపన


- ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఎంపీపీల సంఘం ఉపాధ్యక్షుడు గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి



**వీరబల్లి మన జనప్రగతి జూలై 02:-**వీరబల్లి మండలంలోని గుర్రప్పగారిపల్లె సమీపంలో వెలసిన శ్రీ చిన్న గంగమ్మ తల్లి దేవాలయ పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎంపీపీల సంఘం ఉపాధ్యక్షుడు, వీరబల్లి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి భక్తులు, దాతలు ఉదారంగా విరాళాలు ప్రకటించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ రాజు రూ.5 లక్షలు, ఉమా మహేశ్వర రాజు అండ్ బ్రదర్స్ రూ.2 లక్షలు, మణి రాజు రూ.2,00,116, అబ్బాయిగారి రెడ్డన్న రూ.1 లక్ష విరాళంగా ప్రకటించారు. అలాగే శ్రీ చిన్న గంగమ్మ తల్లి ఆలయంతో పాటు పెద్ద గంగమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు శ్రీరాములు రెడ్డి, హరి ప్రసాద్ రాజు, చైర్మన్ వెంకటరామరాజు, జయరామ రాజు, గ్రామ పెద్దలు, భక్తులు, గుర్రప్పగారిపల్లె గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- టీడీపీ నాయకుడు గూండ్ల నాగేంద్రబాబు విజ్ఞప్తి




**సిద్ధవటం మన జనప్రగతి జూలై 02:-**మండలంలోని మాధవరం-1 గ్రామపంచాయతీ పరిధిలోని బంగారుపేటకు చెందిన టీడీపీ నాయకుడు, రాజంపేట మాజీ రైతు విభాగం కోశాధికారి గూండ్ల నాగేంద్రబాబు గురువారం తన నివాసంలో మాట్లాడుతూ స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం, పార్టీ నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కొత్త పింఛన్ల కోసం అర్హులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ, సంబంధిత అధికారులకు ఇంకా స్పష్టమైన మార్గదర్శకాలు అందలేదని వారు చెబుతున్న పరిస్థితి ప్రజల్లో నిరాశకు దారితీస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు త్వరగా అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గ్రామాల్లో వీధి దీపాలు, సిమెంట్ రోడ్లు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కూడా మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ అంశాలపై ప్రజలు తమ వద్ద తరచూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, వారి సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపితే ప్రభుత్వంపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. రాజంపేట నియెజక వర్గ స్థాయిలో అందరినీ సమన్వయం చేసుకుపోయి అసలైన టిడిపి నాయకులను గుర్తించే నాయకత్వాన్ని తీసుకు రావాలని అభ్యర్థించారు. స్థానిక స్థాయిలో ప్రజల అభిప్రాయాలు, అవసరాలను గుర్తించి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమవుతాయని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని పార్టీ పెద్దలకు, కూటమి నాయకత్వానికి నాగేంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటే ప్రభుత్వం, కూటమిపై ప్రజల్లో మరింత సానుకూల అభిప్రాయం ఏర్పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## పులివెందులలో తప్పిన పెను ప్రమాదం

### - అదుపుతప్పి ద్విచక్ర వాహనాలపైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 02:** స్థానిక పాత బస్టాండ్ సమీపంలో గురువారం ఒక పెద్ద ప్రమాదం తృటిలో తప్పింది. ఆర్టీసీ బస్సు ఒకటి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ద్విచక్ర వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ఘటన స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. అసలేం జరిగిందంటే? ప్రత్యక్ష సాక్షులు మరియు పోలీసుల కథనం ప్రకారం పాత బస్టాండ్ సమీపంలో ముందు వెళ్తున్న కడప ఆర్టీసీ బస్సును ఢీకొట్టకుండా తప్పించే క్రమంలో వెనుక వస్తున్న మరో బస్సు ఒక్కసారిగా పక్కకు దూసుకొచ్చింది. అక్కడ నిలిపి ఉంచిన ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాలపైకి బస్సు వేగంగా దూసుకెళ్లింది. బస్సు తమవైపే దూసుకురావడాన్ని గమనించిన ద్విచక్ర వాహన చోదకులు,స్థానికులు వెంటనే అప్రమత్తమై అక్కడి నుంచి పరుగులు తీశారు. దీంతో ఒక పెద్ద ప్రాణనష్టం తప్పినట్లయింది. ఈ ఘటనలో వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నప్పటికీ,ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు డ్రైవర్ స్పందిస్తూ బస్సు బ్రేకులు అకస్మాత్తుగా ఫెయిల్ అయ్యాయని,అందువల్లే వాహనం కంట్రోల్ కాలేదని ప్రాథమికంగా సమాచారం ఇచ్చారు. ముందున్న బస్సును ఢీకొడితే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంటుందనే ఉద్దేశంతోనే పక్కకు తిప్పాల్సి వచ్చిందని తెలిపారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై విచారణ జరుపుతున్నారు.

## పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న టీడీపీ సీనియర్ నాయకుడు రామచంద్ర నాయుడు

### నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీపీ



**దేవనకొండ మన జనప్రగతి జూలై 02:-**దేవనకొండ మండల పరిధిలో గురువారం నిర్వహించిన పలు వివాహ వేడుకల్లో మాజీ ఎంపీపీ,టీడీపీ సీనియర్ నాయకుడు రామచంద్ర నాయుడు పాల్గొన్నారు. కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన కున్నూరు రామకృష్ణ కుమారుడి వివాహంతో పాటు పల్లెదొడ్డి గ్రామానికి చెందిన బూసుల లక్ష్మన్న మనవరాలి వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. మూడు ముళ్ల బంధంతో నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వివాహ వేడుకల్లో ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ కట్టుబడి పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ టాపర్‌కు రూ.10,116 ప్రోత్సాహక బహుమతి



**కాశినాయన మన జనప్రగతి జులై 02:-**కాశినాయన మండలంలోని వరికుంట్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థిని పాలూరి పవిత్రకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బండి పరిమళ జ్యోతి గురువారం రూ.10,116 ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి నిర్మల మాట్లాడుతూ, విద్యే మనిషికి నిజమైన ఆభరణమని, కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. మండల టాపర్‌గా నిలిచిన పవిత్రను ఆమె ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయిని బండి పరిమళ జ్యోతి మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారి (ఎస్‌ఓ) పాలెం మెర్సీ రాణి,ఉపాధ్యాయులు,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
03 - 07 - 2026

# ప్రకృతి వ్యవసాయం.. రైతులకు అధిక ఆదాయం

**• ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ తల్లం విజయ్‌కుమార్**



**దేవనకొండ మన జనప్రగతి జూలై 02:**-ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు అధిక ఆదాయం లభించడంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందుతుందని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ తల్లం విజయ్‌కుమార్ (ఐఏఎస్, రిటైర్డ్) అన్నారు.దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామంలో గురువారం ఆయన పర్యటించి, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగుచేస్తున్న పండ్ల తోటలు, వాణిజ్య పంటలు, అగ్రో ఫారెస్ట్రీ నమూనాలను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించి, ప్రకృతి వ్యవసాయం ద్వారా దిగుబడులు, రైతుల ఆదాయ వృద్ధి, స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై చర్చించారు.రైతు బైముతి రంగస్వామి పొలంలో ఏర్పాటు చేసిన పీపీఎండీఎస్ (ఏటీఎం) మరియు ఏ-గ్రేడ్ నమూనాలను పరిశీలించిన ఆయన, వాటి ద్వారా నేల సారవంతం పెరిగి పంటల నాణ్యత మెరుగుపడుతుందని తెలిపారు. సహజ పద్ధతుల్లో ఉత్పత్తి చేసిన ఆహారం ప్రజల ఆరోగ్యానికి మేలు చేస్తుందని, ప్రకృతి వ్యవసాయం ప్రపంచానికి అత్యంత అవసరమైన విధానమని పేర్కొన్నారు.కప్పట్రాళ్ల గ్రామ అభివృద్ధిని అభినందిస్తూ, మాజీ కర్నూలు ఎస్పీ, ప్రస్తుత ఈగల్ ఐజీ ఏ.కే. రవికృష్ణ కృషి ప్రశంసనీయమన్నారు. ఇండిగో ప్రాజెక్టు, సే ట్రీస్ సంస్థ సహకారంతో గ్రామాభివృద్ధి విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు. గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలనుకునే వారికి కప్పట్రాళ్ల గ్రామం ఆదర్శమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఈగల్ ఐజీ ఏ.కే. రవికృష్ణ వర్చువల్‌గా పాల్గొని రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, సే ట్రీస్ ప్రతినిధులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# పులివెందుల ఇక ప్రశాంతం,నేరాలకు తావులేదు

**పులివెందుల నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ బీటెక్ రవి**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 02:**-పులివెందుల నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ బీటెక్ రవి పేర్కొన్నారు.పులివెందుల పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ డీఐజీ,కడప జిల్లా ఎస్పీ బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాలో ముఖ్యంగా పులివెందులలో క్రైమ్ రేట్ గణనీయంగా తగ్గిందని ప్రశంసించారు.పట్టణ ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.ఇప్పటి నుంచి పులివెందుల అత్యంత ప్రశాంతంగా మారబోతోంది.పట్టణమంతా సిసి కెమెరాల నిఘా నీడలోకి వచ్చిందని ఇకపై ఇక్కడ నేరాలకు పాల్పడాలంటేనే నేరగాళ్లు భయపడే పరిస్థితిని తీసుకువచ్చాం అని అన్నారు.పులివెందుల ప్రాంత ప్రజలు ఎలాంటి భయాందోళనలు లేకుండా,ప్రశాంతమైన వాతావరణంలో జీవించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.ఇందుకోసం శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం,పోలీస్ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని బీటెక్ రవి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు,కూటమి నాయకులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మావిగన్ రాజధానికి నా మద్దతు..

**• ప్రజలూ ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి:**
**మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 02:**-ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి గురువారం స్థానిక దొరసానిపల్లెలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ఇటీవల మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి రాజధాని అంశంపై వెల్లడించిన వైఖరి ప్రజాభీష్టం ఆధారంగా తీసుకున్న నిర్ణయమని ఆయన పేర్కొన్నారు.2029 ఎన్నికలకు వైసీపీ అజెండా "మావిగన్ రాజధాని" అని జగన్ స్పష్టంగా ప్రకటించారని, మావిగన్‌ను రాజధానిగా కోరుకునే ప్రజలు వైసీపీకి మద్దతు ఇవ్వాలని సూచించారని తెలిపారు.అమరావతి నిర్మాణానికి సుమారు లక్ష ఎకరాల సారవంతమైన భూమి అవసరమవడంతో పాటు దాదాపు రూ.2 లక్షల కోట్ల ప్రజాధనం ఖర్చవుతుందని, అయితే మచిలీపట్నం,విజయవాడ,గుంటూరు (మావిగన్) ప్రాంతంలో ఇప్పటికే జాతీయ రహదారులు,పోర్టు,విమానాశ్రయం, రైల్వే, విద్యాసంస్థలు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండటంతో రూ.10 వేల నుంచి రూ.20 వేల కోట్లలోనే రాజధాని నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉందని జగన్ వివరించిన విషయాన్ని గుర్తు చేశారు.అమరావతి పేరుతో గత ఏడు సంవత్సరాలుగా అధికారంలో ఉన్న ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పనులు పూర్తి చేయలేదని, అభివృద్ధి నత్తనడకన సాగుతోందని విమర్శించారు.2029 ఎన్నికల మేనిఫెస్టోలో మావిగన్‌ను రాజధానిగా ప్రకటించడం నిజాయితీతో కూడిన రాజకీయ నిర్ణయమని అభివర్ణించారు.తాను వ్యక్తిగతంగా మావిగన్ రాజధాని ప్రతిపాదనకు పూర్తి మద్దతు ఇస్తున్నానని, తన ఓటు కూడా మావిగన్‌కేనని ప్రకటించారు. ప్రొద్దుటూరు ప్రజలు కూడా ఈ అంశంపై ఆలోచించి తమ నిర్ణయం తీసుకోవాలని కోరారు.వచ్చే ఎన్నికల్లో మావిగన్ రాజధాని కావాలనుకునే వారు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని,మరోవైపు కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేసి ఉంటే, అభివృద్ధి మరియు సంపద సృష్టిలో విజయవంతమై ఉంటే,శాంతిభద్రతలు మెరుగుపరిచి ఉంటే కూటమికే ఓటు వేయాలని ప్రజలను కోరతామని తెలిపారు.అలాగే,జగన్ వ్యాఖ్యలను కూటమి నాయకులు వక్రీకరించకుండా,అమరావతి వారి అజెండా అయితే ఎన్ని సంవత్సరాల్లో పూర్తి చేస్తారో ప్రజలకు స్పష్టంగా చెప్పి ఓట్లు అడగాలని సూచించారు."ప్రజాభిప్రాయమే జగన్ మాట..జగన్ మాటే మా బాట" అని రాచమల్లు శివప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

# బొమ్మనహల్ మండలంలో వీబీజీరామ్‌జీ పనులకు ఘనంగా ప్రారంభం



**బొమ్మనహల్ మన జనప్రగతి జూలై 02:**-కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జాతీయ స్థాయి తిరుపతిలో, మరియు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,గౌరవ ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా వీబీజీరామ్‌జీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు,ఈ సంధర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, సాగునీటి సదుపాయాల మెరుగుదల,రైతులకు ఉపయుక్తమైన పనులను వేగవంతం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు,దీనిలో భాగంగా బొమ్మనహల్ మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యంగా మండల కేంద్రం బొమ్మనహల్ గ్రామంలో మండల సీనియర్ నాయకులు ఉద్దేహాల్ సహకార సంఘం అధ్యక్షులు కొత్తపల్లి మల్లికార్జున,మరియు ఎంపీపీ ముల్లంగి నాగమణి, నారాయణస్వామి,మండల ఎంపిడివో విజయభాస్కర్ పయ్యావుల అనిల్,చేతుల మీదుగా వీబీజీరామ్‌జీ,ఫీడర్ ఛానల్ పనులకు శంకుస్థాపన చేసి లాంఛనంగా ప్రారంభించారు,ఈ సందర్భంగా సీనియర్ నాయకులు కొత్తపల్లి మల్లికార్జున మాట్లాడుతూ..గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను సమయానికి పూర్తి చేయాలని, ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులు చేపట్టాలని అధికారులు సూచించారు,ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నీటి పారుదల వ్యవస్థ బలోపేతం కావడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, వ్యవసాయ ఉత్పత్తి పెరుగుదలకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు,అలాగే మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పనులు పారదర్శకంగా, నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని అధికారులకు తెలియజేశారు, ఏపీవో లక్ష్మీకాంత బాయ్,ఈసీ నాగభూషణం,టెక్నికల్ అసిస్టెంట్లు గురుమూర్తి,బ్రహ్మయ్య,ఫీల్డ్ అసిస్టెంట్లు,మరియు కూలీలు పాల్గొన్నారు.

# తనకు రక్షణ కల్పించాలని బాధితురాలు షేక్ మౌలాని విజ్ఞప్తి

**• తప్పుడు కేసులు, ప్రాణహాని ఉందని ఆందోళన**

**• అధికారుల జోక్యంతో న్యాయం చేయాలని వినతి**



**కడప మన జనప్రగతి జూలై 02:**-తనపై తప్పుడు కేసులు నమోదు చేయడమే కాకుండా ప్రాణహాని కలిగించేలా కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ తనకు పోలీసు రక్షణ కల్పించాలని బాధితురాలు షేక్ మౌలాని కోరారు.కడప ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, పాలెంపల్లెకు చెందిన యాసాని శివయ్య గతంలో తన నుంచి రూ.20 లక్షలు ఇవ్వాలని నోటీసులు పంపారని తెలిపారు. అనంతరం రూ.4 లక్షల వ్యవహారంపై దాఖలైన కేసులో కోర్టు తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని చెప్పారు.తాజాగా మరోసారి తనపై రూ.11 లక్షలు ఇవ్వాలని ఫిర్యాదు చేయడంతో పాటు సాయిపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద తాము దాడి చేశామని తప్పుడు ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు స్టేషన్‌కు పిలిపించగా, తాను సీఐ, ఎస్పీలను కలిసి వాస్తవాలు వివరించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.తనను హత్య చేసేందుకు కుట్ర జరుగుతోందని, తనకు ఏదైనా జరిగితే తన భర్త, బిడ్డలకు దిక్కెవరని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి తనకు న్యాయం చేయాలని, వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, స్థానిక ఎమ్మెల్యే మాధవీరెడ్డి, జిల్లా అధికారులను ఆమె కోరారు.విలేకరుల సమావేశంలో షేక్ మౌలాని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి ఆనం,ఎమ్మెల్యే వరద



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 02:**-ప్రొద్దుటూరు పట్టణంలోని పప్పుల బజార్ వీధిలో నూతనంగా నిర్మించి పునఃప్రారంభించిన శ్రీశ్రీశ్రీ గంగమ్మ దేవాలయాన్ని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి గురువారం సందర్శించారు. ఆలయానికి చేరుకున్న మంత్రి, ఎమ్మెల్యేలకు ఆలయ నిర్వాహకులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య మంత్రి, ఎమ్మెల్యేలకు పూర్ణకుంభ స్వాగతం అందించారు. అనంతరం వారు గంగమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖశాంతులతో,ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు. ఇటీవల ఆలయాన్ని నూతనంగా నిర్మించి పునఃప్రారంభించడం పట్ల స్థానిక భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారని, ఆలయాలు ఆధ్యాత్మికతతో పాటు సామాజిక ఐక్యతకు ప్రతీకలుగా నిలుస్తాయని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.అనంతరం ఆలయ నిర్వాహకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, వారి కుటుంబ సభ్యులు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డిలను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, షేక్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ ముక్తియార్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్ సర్వే కార్యక్రమంపై ఈఆర్‌ఓ విస్తృత పర్యటన



**బొమ్మనహల్ మన జనప్రగతి జూలై 02:**-ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమంలో భాగంగా పనులు పర్యవేక్షణ కోసం రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, రవిశంకర్ రెడ్డి బొమ్మనహల్ మండలంలోనీ ఎల్‌బీ.నగర్, గౌనూరు,ఉద్దేహాల్,ఉంతకల్లు, బొమ్మనహల్, నేమకల్ గ్రామాలను సందర్శించి,ఎస్ఐఆర్, కార్యక్రమంపై అధికారులు చేస్తున్న సర్వే పనులు పరిశీలించారు,ఈ సందర్భంగా ఈఆర్‌ఓ,రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ..ఏ ఏ గ్రామాలలో ఏ అధికారి పరిధిలో ఎంత మంది ఓటర్లు ఉంటే అంతమంది తప్పకుండా సంబంధిత బీఎల్‌వోలకు ఇంటింటి సర్వే ద్వారా సేకరిస్తున్న వివరాల ఫారాలను శనివారంలోపు వంద శాతం పూర్తి చేసి,వాటిని డిజిటలైజేషన్ కూడా పూర్తిచేయాలని తెలియజేశారు. అదేవిధంగా గ్రామాల ప్రతి ఒక్క అర్హత కలిగిన ఓటరును గుర్తించి, ఎలాంటి పొరపాట్లు లేకుండా ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ఇన్చార్జి తహశీల్దార్,రఘు,వివిధ గ్రామాల రెవిన్యూ అధికారులు,బిఎల్‌ఓ లు, పాల్గొన్నారు,

# డీఐజీ కోయ ప్రవీణ్‌ను కలిసిన తెలుగు యువత నాయకుడు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 02:**-కడప జిల్లా పులివెందుల ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో డీఐజీ కోయ ప్రవీణ్‌ను కడప పార్లమెంటరీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అక్కులగారి విజయ్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా డీఐజీ కోయ ప్రవీణ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.పులివెందులలో శాంతిభద్రతలు,ప్రజా భద్రతకు సంబంధించి పోలీసు శాఖ చేపడుతున్న చర్యలను అభినందించారు.అనంతరం కొద్దిసేపు పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం.

# గృహ వినియోగ ఎల్పీజీ ధరలను యుద్ధానికి ముందు స్థాయికి తగ్గించాలి

**- డీసీసీ అధ్యక్షురాలు ఎన్.డి.విజయజ్యోతి**




**కడప మన జనప్రగతి జూలై 02:**-ఇరాన్ఇజ్రాయెల్అమెరికా మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు, హోర్ముజ్ జలసంధిలో ఏర్పడిన అనిశ్చితిని సాకుగా చూపి పెంచిన గృహ వినియోగ 14.2 కిలోల ఎల్పీజీ సిలిండర్ ధరలను వెంటనే యుద్ధానికి ముందు ఉన్న స్థాయికి తగ్గించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, పశ్చిమ ఆసియా పరిస్థితుల కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగిన నేపథ్యంలో దేశీయ ఎల్పీజీ సిలిండర్ ధరను మార్చిలో రూ.60, అనంతరం జూన్‌లో మరో రూ.29 పెంచి మొత్తం రూ.89 మేర భారాన్ని సామాన్య ప్రజలపై మోపారని విమర్శించారు.ప్రస్తుతం ఇరాన్ఇజ్రాయెల్ ఘర్షణ తీవ్రత తగ్గడం, హోర్ముజ్ జలసంధి ద్వారా చమురు రవాణా సాధారణ స్థితికి చేరుకోవడం, అంతర్జాతీయ ముడి చమురు ధరలు యుద్ధానికి ముందు స్థాయికి చేరుకోవడంతో పాటు ప్రపంచ మార్కెట్‌లో ఎల్పీజీ ధరలు కూడా తగ్గుముఖం పట్టాయని ఆమె పేర్కొన్నారు.ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం, చమురు మార్కెటింగ్ సంస్థలు తక్షణమే గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధరలను తగ్గించి సామాన్య ప్రజలకు ఉపశమనం కల్పించాలని విజయజ్యోతి విజ్ఞప్తి చేశారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్త విద్యార్థి ఉద్యమం తప్పదు


**ప్రభుత్వ విద్యా విధానం పేద, బీసీ విద్యార్థులకు అనుకూలంగా లేదని గుజ్జ సత్యం విమర్శ**

**పాలమూరు యూనివర్సిటీలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిరాహార దీక్ష అధ్యాపకులు, విద్యార్థి సంఘాలు, సామాజిక సంస్థల సంఘీభావం**

**మహబూబ్‌నగర్, మన జనప్రగతి జూలై 02:**తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమం ఉధృతం అవుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం హెచ్చరించారు. పాలమూరు యూనివర్సిటీలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ సాధన దీక్ష లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి యూనివర్సిటీకి చెందిన పలువురు ప్రొఫెసర్లు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, సామాజిక సంస్థల నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గుజ్జ సత్యం మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత విద్యను సామాజిక న్యాయ సాధనంగా తీర్చిదిద్దుతామని ఇచ్చిన హామీలు ఆచరణలో బలహీనపడుతున్నాయనే ఆందోళన వ్యక్తం చేశారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం కారణంగా వేలాది మంది విద్యార్థులు కాలేజీల్లో అవమానాలు ఎదుర్కొంటున్నారని, పరీక్షలకు అనుమతించకపోవడం, సర్టిఫికెట్లు నిలిపివేయడం, చదువు మధ్యలోనే మానేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యా విధానంపై స్పందిస్తూ, విధానాల కంటే వాటి అమలే ముఖ్యమని పేర్కొన్నారు. విద్యా సంస్కరణల పేరుతో తీసుకొచ్చే ప్రతి నిర్ణయం పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల చదువుకు భరోసా కల్పించాలే తప్ప, వారి ఆర్థిక భారం పెంచేలా ఉండకూడదన్నారు. విద్యార్థికి అందుబాటులో లేని విధానం ఎంత ఆకర్షణీయంగా కనిపించినా అది ప్రజా విధానం కాదు అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్నప్పటికీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడం ఆ ప్రకటనలకు విరుద్ధమని విమర్శించారు. విద్యార్థులకు చెల్లించాల్సిన నిధులు సమయానికి విడుదల కాకపోతే, ఉన్నత విద్య పేద కుటుంబాలకు అందని ద్రాక్షగా మారే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రైవేట్, ప్రొఫెషనల్ కళాశాలలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, దాని ప్రభావం నేరుగా విద్యార్థులపై పడుతోందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వ్యవస్థను బలోపేతం చేయకుండా విద్యా రంగంలో నాణ్యత గురించి మాట్లాడటం అసంపూర్ణమని అన్నారు. ప్రభుత్వాలు మారొచ్చు విధానాలు మారొచ్చు కానీ పేద విద్యార్థి చదివే హక్కు మారకూడదు. విద్యపై పెట్టుబడి ఖర్చు కాదు అది రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టుబడి” అని గుజ్జ సత్యం స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు, భవిష్యత్తులో ఆలస్యం జరగకుండా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

**విద్యార్థుల పోరాటానికి అందరూ అండగా నిలవాలి: తాయప్ప**

పాలమూరు యూనివర్సిటీ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు తాయప్ప మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ నిరాహార దీక్ష ఏ రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా కాదని, విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు చేపట్టిన ప్రజాస్వామ్య ఉద్యమమని పేర్కొన్నారు.




**అధ్యాపకులు, విద్యార్థి సంఘాల సంఘీభావం**

కార్యక్రమంలో పాల్గొన్న పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ, విద్యా అవకాశాలు ఆర్థిక స్థోమతపై ఆధారపడే పరిస్థితి ఏర్పడకూడదని అభిప్రాయపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం సామాజిక న్యాయానికి కీలకమైన సాధనమని, ప్రభుత్వం దీనిపై అత్యవసరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

**ప్రధాన డిమాండ్లు**

పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. ఫీజుల కారణంగా విద్యార్థులను పరీక్షలకు అనుమతించకుండా ఉండే చర్యలను నిలిపివేయాలి. సర్టిఫికెట్లు నిలిపివేయడంపై కఠిన ఆదేశాలు జారీ చేయాలి. కొత్త విద్యా విధానంపై విద్యార్థి సంఘాలు, అధ్యాపకులు, నిపుణులతో విస్తృత చర్చ నిర్వహించాలి. పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల ఉన్నత విద్యకు పూర్తి రక్షణ కల్పించే విధానాలను అమలు చేయాలి. పలువురు ప్రముఖుల పాల్గొనడం ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షురాలు మట్ట జయంతి గౌడ్, నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడు జగన్, పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ కుమారస్వామి, నాన్-టీచింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామ్మోహన్, జీబీసీ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నగర్, మాజీ డీఈఓ విజయ్ కుమార్, సారంగి లక్ష్మీకాంత్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్, స్వేరో రాష్ట్ర అధ్యక్షుడు పవన్, లంబాడి హక్కుల సమితి అధ్యక్షుడు సాయి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు నరేందర్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శివాజీ, వివిధ బీసీ విద్యార్థి సంఘాల నాయకులు, పరిశోధక విద్యార్థులు, ప్రొఫెసర్లు, సామాజిక సంస్థల ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు. వక్తలందరూ ఏకగ్రీవంగా మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్‌లను ఆలస్యం చేయడం వల్ల పేద, బీసీ విద్యార్థుల ఉన్నత విద్య ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే పెండింగ్ నిధులను విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కళాశాలలను కలుపుకొని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యపై పెట్టుబడి పెట్టడం రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టుబడి అని, పేద విద్యార్థి చదువుకు రక్షణ కల్పించడం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని స్పష్టం చేశారు.

# 12 మంది దోపిడీ ముఠా అరెస్ట్... నిందితులలో ఆర్ఎస్ఐ, కానిస్టేబుల్



**17 లక్షల నగదు, మూడు కార్లు, డమ్మీ చిల్డ్రన్ కరెన్సీ నోట్లు స్వాధీనం**

**మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్**

**సత్తుపల్లి, మన జనప్రగతి జూలై 02:**అక్రమ మార్గములో డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో అమాయకులను మోసం చేస్తున్న 12 మంది ముఠా సభ్యులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు. గురువారం సత్తుపల్లి లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కల్లూరు ఏసిపి మాట్లాడుతూ జూన్ 25న సత్తుపల్లి పోలీస్ స్టేషన్ లో మోసపోయిన బాధితుడైన కడప జిల్లా, పొద్దుటూరు కు చెందిన కుర్రా గంగాధర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సత్తుపల్లి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. అక్రమార్జనకు అలవాటు పడిన కొంతమంది నిందితులు డమ్మీ చిల్డ్రన్ నకిలీ కరెన్సీ తో అమాయక ప్రజలను మోసంచేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ప్రత్యేక పోలీస్ బృందం బుధవారం ఉదయం గంగారం లో తనిఖీ చేసి నిందితులను అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిపారు. ఈ కేసులో గంగరాం 15 వ. బెటాలియన్ కానిస్టేబుల్ ముల్లగిరి వర్ధన్, ఆర్ఎస్సై బేరా కేశవరావు లు కూడా వున్నారని పేర్కొన్నారు. నిందితుడు ముందుగా సిమ్ కార్డులను తీసుకొని ఆ సిమ్ ల ద్వారా ఏదో ఒక నంబర్ కు ఫోన్ చేసేవాడిని, ఎవరైనా అమాయకులు ఫోన్ ఎత్తితే “నా పేరు మహేందర్ రెడ్డి, ఏ బాలగంగాధర్ ఏ చంద్రం ఏ చంటి బాబు అని ఒక్కొక్కరికి ఒక్కొక్క పేరు చెబుతూ... నేను రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాను, నా ఎకౌంట్లో 2 కోట్ల రూపాయలు బ్లాక్ మని వున్నది, నాకు ఇన్కమ్ టాక్స్ సమస్యలు వున్నాయి. నేను అట్టి బ్లాక్ మని ని వైట్ మని గా మార్చాలను కుంటున్నాను. మీరు ఎవరైనా నాకు డబ్బులు ఇస్తే అందుకు బదులుగా మీకు ఒకటికి, నాలుగు రెట్లు డబ్బులు ఇస్తాను, అట్టి డబ్బులను నగదు రూపములో గాని, ఎకౌంట్ ద్వారా గాని ఇస్తాను అని చెప్పి, మీరు నా మీద నమ్మకం వుంచి నేను చెప్పిన చోటుకు డబ్బులు తీసుకొని వస్తే , మా మనిషి మీ వద్దకు వస్తాడు, అతనికి ఆ డబ్బులు చూపించి, మీ ఎకౌంట్ నంబర్ ఇస్తే నేను ఒకటికి, నాలుగు రెట్లు డబ్బులు మీ ఎకౌంట్లో వేస్తాను, మీరు 10 లక్షల రూపాయలు కనుక నాకు డబ్బులు ఇస్తే మీకు 40 లక్షల రూపాయలు మీ ఎకౌంట్ లో వేస్తాను, మీరు ఆ డబ్బులలో నుండి పన్నెండు లక్షల రూపాయలు తీసుకొని , నాకు



మీరు ఇచ్చిన పది లక్షలు పోను మిగతా పద్దెనిమిది లక్షలు నాకు క్యాష్ ఇవ్వండి అని వారికి ఈ విధముగా ఆకర్షించే మోసపు మాటలు చెప్పేవాడిని తెలిపారు. మాటలు నమ్మి చెప్పిన చోటకు వచ్చే వ్యక్తులకు నమ్మకం కలిగించేలా మాటలు చెప్పి తన మనిషిని వారి వద్దకు “డమ్మీ చిల్డ్రన్ కరెన్సీ నోట్లు“ వున్న బ్యాగును ఇచ్చి పంపేవారని, ఇచ్చిన ఒరిజినల్ డబ్బులు తన మనిషి లెక్కబెట్టే సమయములో ముందుస్తూ ఏర్పాటు చేసుకున్న ముఠా సభ్యులలోని ఒరిజినల్, నకిలీ పోలీసులు ముందే ఏర్పాటు చేసుకున్న కార్లలో వెళ్ళి వారిని దొంగనోట్లు వ్యాపారం చేస్తున్నారని, లేదా మోస్ట్



వాంటెడ్ క్రిమినల్ అని వారిని బెదిరించి , అవసరమైతే వారిని, వాళ్ళతో పాటు ముఠా ఏర్పాటు చేసుకున్న వాళ్ళ మనిషిని కూడా వారికి అనుమానం రాకుండా కొట్టి వాళ్ళ దగ్గర డబ్బులు లాక్కొని వచ్చేలా ముందే పథకం వేసుకొని ఒక కుట్ర పన్ని దోపిడీ చేస్తున్నారని తెలిపారు. కేసు పరిశోధనలో భాగముగా అరెస్టు చేసిన నిందితులు ఏ-1 నుండి ఏ-12 వరకు అరెస్టు చేసి రిమాండు కు పంపనైనది. ఇట్టి కేసులో ఏ-13, ఏ-14 లు పరారీలో వున్నారని తెలిపారు. 17,60,000/- నగదు. 2 ఇన్నోవా వాహనాలు 1 ఎర్టిగా కారు. 1 TVS స్కూటీ. 16 సెల్ ఫోన్లు. పోలీస్ యూనిఫామ్ 500 రూపాయల డమ్మీ చిల్డ్రన్స్ కరెన్సీ 80 బండిల్స్ రికవరీ చేసినట్లు తెలిపారు. సత్తుపల్లి సిఐ తుమ్మలపల్లి శ్రీహరి, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాలో యూరియా కొరతలేదు

**- జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య**

**- రైతులకు అవసరమైన మేరకు సమృద్ధిగా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయి**

**- యూరియా యాప్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా బుకింగ్ చేసుకుని కొనుగోలు చేస్తున్న రైతులు**

**ఖమ్మం ప్రతినిధి,మన జనప్రగతి జూలై 02:**వానాకాలం2026 సీజన్‌కు సంబంధించి వ్యవసాయ శాఖ, తెలంగాణ ప్రభుత్వం ఖమ్మం జిల్లాకు మొత్తం 35,267 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించిందని, జిల్లాలో రైతుల అవసరా లకు సరిపడా యూరియా నిల్వలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ డీలర్ల వద్ద 691.13 మెట్రిక్ టన్నులు (15,359 బస్తాలు), ప్రాథ మిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద 920.02 మెట్రిక్ టన్ను లు (20,445 బస్తాలు), మార్క్ ఫెడ్ ఖమ్మం వద్ద 7,656.16 మెట్రిక్ టన్నులు



(1,70,137 బస్తాలు), కంపెనీ గోదాముల్లో 991.51 మెట్రిక్ టన్నులు (22,034 బస్తాలు), కమీషనర్ రిజర్వ్ పూల్ (సీఆర్‌పీ)లో 6,898.05 మెట్రిక్ టన్నులు (1,53,290 బస్తాలు) నిల్వ ఉన్నాయని తెలిపారు. 2026 జూలై 2 నాటికి జిల్లాలో మొత్తం 17,156.88 మెట్రిక్ టన్నుల యూరియా (3,81,264 బస్తాలు) అందుబాటులో ఉందని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు యూరియా యాప్ ద్వారా 56,926 మంది రైతులు 1,80,738 బస్తాలను బుక్ చేసుకొని, 1,60,316 బస్తాలను కొనుగోలు చేశారని తెలిపారు. యూరియా యాప్ ద్వారా రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియాను బుక్ చేసుకుని కొనుగోలు చేస్తున్నారని వివరిం చారు. రైతు సోదరులు ఎలాంటి అపోహలకు గురి కాకుండా అవసరమైన మేరకు మాత్రమే యూరియాను కొనుగోలు చేయా లని, జిల్లాలో రైతులకు అవసరమైన మేరకు యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. ప్రతి మండల పరిధిలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా వ్యవసా య శాఖ నిరంతరం చర్యలు తీసుకుంటోందని, రైతులు యూరి యా లభ్యతపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
03 - 07 - 2026

# శాశ్వత వసతులు,ఉపాధి కల్పనే విబిజీ రామ్ జీ లక్ష్యం


- **టిడిపి మండల కన్వీనర్ ఎస్. రామమునిరెడ్డి**
- **లైవ్ టెలికాస్ట్‌లో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు**



**వేంపల్లె మన జనప్రగతి జులై 02:-**గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత మౌలిక వసతులతో పాటు ఉపాధి కల్పనే విబిజీ రామ్ జీ పథకం లక్ష్యమని టిడిపి మండల కన్వీనర్ సింగా రెడ్డి రామ మునిరెడ్డి అన్నారు. గురువారం తిరుపతి జిల్లాలోని రైల్వేకోడూరు, ముక్కవారిపల్లి గ్రామంలో ఏపి సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్ కళ్యాణ్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఉమ్మడిగా విబిజీ రామ్ జీ పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమ లైవ్ టెలికాస్ట్ ని స్థానిక ఎంపిడిఓ సభ భవనంలో ఏర్పాటు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, ఉపాధి శ్రామికులు పాల్గొని విక్షీంచారు. అనంతరం కన్వీనర్ రామమునిరెడ్డి మాట్లాడుతూ ఏపి సిఎం చంద్రబాబు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నట్లు తెలిపారు. ఓ వైపు ప్రజా సంక్షేమ పాలన అందిస్తూ మరోవైపు వివిధ పారిశ్రామిక ప్రాజెక్టుల శంకుస్థాపనలు, గ్రామీణ ఉపాధి పథకాల ప్రారంభం, ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఎంతోమందికీ ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నారన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్ ల కింద విబిజీ రామ్ జీ పథకాన్ని అమల్లోకి తెచ్చి గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తూ ఉపాధి కల్పనే ధ్యేయంగా కూలీలకు భారీ లబ్ధి చేకూరుతుందన్నారు. అలాగే ఇప్పటి వరకు ఉన్న పనిదినాలను 125 రోజులకు పెంచడం జరిగిందన్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చేందుకు ఈ పథకం ఎంతో దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిడిఓ వెంకట సుబ్బయ్య, ఎంపిడిఓ కుళాయమ్మ, డిప్యూటీ ఎంపిడిఓ రమణయ్య, ఏపిఓ పార్వతి, ఏపిఎం వెంకటేశ్వర రావు, టిడిపి మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరబద్ర, పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, క్లస్టర్ ఇంచార్జీ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎంపి వైద్యుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

- **తులసిరెడ్డికి ఆర్ఎంపీల వినతి.**



**వేంపల్లె మన జన ప్రగతి జులై 02:-**గ్రామీణ వైద్యుల (ఆర్.ఎం.పి) సమస్యల పరిష్కారం పై ప్రభుత్వం దృష్టి సారించాలని మాజీ ఎంపీ రాష్ట్ర కాంగ్రెస్ మీడియా సెల్ చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. కడప జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా కమిటీ సభ్యులు వేంపల్లి కి వచ్చి మాజీ ఎంపీ తులసి రెడ్డిని కలిసి తమ సమస్యలను ఆయనకు విన్నవించి వినతిపత్రం సమర్పించారు. కడప, వేంపల్లి, ప్రొద్దుటూరు దువ్వూరు కమలాపురం, మండలాలకు చెందిన ఆర్ఎంపీ వైద్యులు తులసి రెడ్డిని కలిశారు.వారి సమస్యలను ఆయన సావధానంగా విన్నారు. సదరు ఆర్ఎంపీల సమస్యల పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఆర్ఎంపీల విభాగం జిల్లా కమిటీ అధ్యక్షులు ఆరుసేర్ల ఆంజనేయులు, కార్యదర్శి ఖలీలుల్లా, వర్కింగ్ ప్రెసిడెంట్ రంగయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ అమీర్,జిల్లా డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ సుబ్రహ్మణ్యం, నాగార్జున,కరిముల్లా,, రామకృష్ణ,ఖలీల్, రామాంజనేయులు, రవి, సునీల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం,పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గపు సమన్వయకర్త ధ్రువ కుమార్రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథరెడ్డి,ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.

# ఉక్కు పరిశ్రమపై మరోసారి రాజకీయ రగడ

**శంకుస్థాపనలతోనే కాలం గడుస్తోందన్న సీపీఐ**

**ప్రభుత్వ రంగంలోనే పరిశ్రమ నిర్మించాలని డిమాండ్**




**వేంపల్లి మన జనప్రగతి జులై 02:-** కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశం మరోసారి రాజకీయ చర్చకు దారితీసింది. ఉక్కు పరిశ్రమ పేరుతో వరుసగా శంకుస్థాపనలు చేస్తూ కాలం గడుపుతున్నారే తప్ప, నిర్మాణ పనుల్లో ఎలాంటి పురోగతి లేదని సీపీఐ కడప జిల్లా కార్యదర్శి గాలి చంద్ర విమర్శించారు. ప్రభుత్వ రంగంలోనే పూర్తి స్థాయి ఉక్కు పరిశ్రమను నిర్మించి జిల్లా నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.గురువారం వేంపల్లిలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో గాలి చంద్ర మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన సందర్భంగా ఉక్కు పరిశ్రమ పనులపై జరుగుతున్న హడావుడిని తప్పుబట్టారు. గత ముఖ్యమంత్రుల హయాంలోనూ ఇదే పరిశ్రమకు పలుమార్లు శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలకే పరిమితం చేశారని విమర్శించారు.మహానాడు వేదికగా పనులు ప్రారంభిస్తామని ప్రకటించినప్పటికీ, నెలలు గడిచినా నిర్మాణం ముందుకు సాగలేదన్నారు. ప్రత్యక్షంగా 25 వేల మందికి, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పించే పరిశ్రమను కేవలం రూ.1,600 కోట్ల కేటాయింపులతో కుదించి, ఉక్కు ఫ్యాక్టరీని "తుక్కు ఫ్యాక్టరీ"గా మారుస్తున్నారని ఆరోపించారు.ప్రభుత్వ రంగంలో నిర్మించాల్సిన పరిశ్రమను ప్రైవేట్ సంస్థకు అప్పగిస్తూ, ప్రజాధనంతో ముఖ్యమంత్రి పరిశీలనకు వెళ్లడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. జిల్లాలో ప్రకటించిన అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.గండికోట, వామికొండ, సర్వరాయసాగర్, చిత్రావతి, పైడిపాలెం ప్రాజెక్టుల నిర్వాసితుల సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని, కడపబెంగళూరు రైల్వే లైన్, కొప్పర్తి పారిశ్రామిక కేంద్రం, పులివెందుల మెడికల్ కాలేజీ వంటి కీలక ప్రాజెక్టులు రెండేళ్లుగా పూర్తికాకపోవడం విచారకరమన్నారు.ప్రజలను మభ్యపె ట్టే పర్యటనల కంటే కడప జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని, ప్రభుత్వ రంగంలోనే పూర్తి సామర్థ్యంతో ఉక్కు పరిశ్రమను నిర్మించాలని సీపీఐ డిమాండ్ చేసింది.ఈ సమావేశం లో సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాములు, సహాయ కార్యదర్శి అంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై చర్యలేవి..?

**అధిక ఫీజులు, అక్రమ కోర్సుల పేరుతో దోపిడీపై తనిఖీలు చేపట్టాలి - గడ్డం రాజు**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జులై 02:-**కడప జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ అన్ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న అక్రమాలపై సంబంధిత అధికారులు వెంటనే ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రైవేట్ టీచర్స్ మరియు లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం రాజు డిమాండ్ చేశారు.ఆయన మాట్లాడుతూ జిల్లాలో దాదాపు వందకు పైగా ప్రైవేట్ అన్ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు ఉన్నాయని, 202627 విద్యా సంవత్సరానికి తరగతులు ప్రారంభమై ఇప్పటికే కొనసాగుతున్నప్పటికీ, ప్రాంతీయ సంయుక్త విద్యా సంచాలకుడు ప్రాంతీయ విద్యాధికారి ఇప్పటివరకు ఎన్ని కళాశాలలను తనిఖీ చేశారో ప్రజలకు వెల్లడించాలని కోరారు. ప్రైవేట్ కళాశాలల్లో ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులకు విరుద్ధంగా అధిక ట్యూషన్ ఫీజులు, మెటీరియల్ ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.అంతేకాకుండా సరైన అనుమతులు లేకుండానే ఐఐటి , జేఈఈ అడ్వాన్స్, ఈఏపీ సెట్ , ఐఐటి ఆకాష్ వంటి పేర్లతో ప్రత్యేక కోచింగ్ నిర్వహిస్తూ ఒక్కో విద్యార్థి నుంచి రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యంగా ప్రొద్దుటూరు, కడప ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. అధికారులు "మామూళ్ల మత్తులో" ఉండడం వల్లే ఈ అక్రమాలను పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. అలాగే ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు అధ్యాపకులను తీవ్రంగా దోపిడీ చేస్తున్నాయని, కనీస వేతనాలు కూడా ఇవ్వకుండా కేవలం తొమ్మిది నెలల జీతమే చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగులకు పిఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించకుండా యాజమాన్యాలు వ్యవహరించడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ఆర్జెడి , ఆర్ ఐ ఓ అధికారులు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రైవేట్ అన్ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో సమగ్ర తనిఖీలు నిర్వహించి, అధిక ఫీజుల వసూళ్లు, అనుమతి లేని కోర్సులు, అధ్యాపకుల హక్కుల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని గడ్డం రాజు డిమాండ్ చేశారు.

# దేవగిరిలో డెంగ్యూ నివారణపై విద్యార్థుల అవగాహన ర్యాలీ




**బొమ్మనహల్ మన జనప్రగతి జులై 02:-**మండల పరిధిలో దేవగిరి గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులను డెంగ్యూ నివారణ మాసోత్సవంలో భాగంగా గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు,"చేయి చేయి కలుపుదాం,పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకుందాం,పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్య భద్రత" అనే నినాదాలతో గ్రామంలో ర్యాలీ చేపట్టి ప్రజలకు డెంగ్యూ నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు,ఈ సందర్భంగా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, ఇంట్లోని నీటి పాత్రలు,డ్రమ్ములను శుభ్రపరచి గంటసేపు ఆరబెట్టి, వాటికి మూతలు ఉంచాలని సూచించారు,నీరు నిల్వ ఉండకుండా చూసుకుంటే దోమల ఉత్పత్తి తగ్గుతుందని,పగటిపూట కుట్టే దోమల వల్ల డెంగ్యూ జ్వరం వస్తుందని వివరించారు,అలాగే దోమతెరలు ఉపయోగించడం, వేపాకు పొగ వేయడం వంటి నివారణ చర్యలను పాటించాలని ప్రజలకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం జయమ్మ, ఉపాధ్యాయులు నగేష్,వరలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త గోవర్ధన్,ఆశా కార్యకర్తలు శ్రావణి,లక్ష్మిదేవి, విద్యార్థులు,గ్రామస్థులు, పాల్గొన్నారు.

# చంద్రబాబు ప్రశంసల కోసమే వైఎస్సార్ విగ్రహం కూల్చివేత: కాశీభట్ల



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జులై 02:-**రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ప్రశంసలు పొందడానికే జమ్మలమడుగు నియోజకవర్గంలోని దేవగుడి గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి (వైఎస్సార్) విగ్రహాన్ని కూల్చివేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్ఈసీ సభ్యుడు కాశీభట్ల సత్య సాయినాథ్ శర్మ ఆరోపించారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, జమ్మలమడుగు నియోజకవర్గంలో స్టీల్ ఫ్యాక్టరీ పనుల ప్రారంభోత్సవానికి శుక్రవారం రానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ప్రసన్నం చేసుకునేందుకే ఈ చర్యకు పాల్పడ్డారని విమర్శించారు.దేవగుడి గ్రామంలో అప్పట్లో వైసీపీ నాయకుడిగా ఉన్న చదిపిరాళ్ల నారాయణరెడ్డి వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విషయం అందరికీ తెలిసిందేనని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం నారాయణరెడ్డి కుమారుడు భూపేష్ రెడ్డి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో, గతంలో తమ కుటుంబం ఏర్పాటు చేసిన విగ్రహాన్నే కూల్చివేయడం వల్ల వారికి కలిగే ప్రయోజనం ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.దివంగత నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేసి తిరిగి వాటినే కూల్చివేయడం మహాపాపంతో సమానమని ఆయన వ్యాఖ్యానించారు.ముఖ్యమంత్రి వద్ద మెప్పు పొందేందుకు ఇటువంటి చర్యలకు పాల్పడటం ఏమాత్రం సమంజసం కాదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించడం, వైసీపీ నాయకులను దూషించడం, వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేయడం వంటి చర్యల ద్వారా చంద్రబాబు నాయుడి ప్రశంసలు పొందాలని కొందరు స్థానిక నాయకులు ప్రయత్నించడం దురదృష్టకరమని సాయినాథ్ శర్మ అన్నారు. రాజకీయాల్లో ప్రత్యర్థుల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు సహజమే అయినప్పటికీ, గతంలో తామే ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తమ వారితోనే కూల్చివేయించడం బాధ్యత గల ప్రజాప్రతినిధులకు తగిన చర్య కాదన్నారు.దేవగుడి గ్రామంలో అధికార కూటమి నాయకులకు తెలియకుండా వైఎస్సార్ విగ్రహం కూల్చివేత జరిగిందా అని ఆయన ప్రశ్నించారు. వారిలో నిజాయితీ ఉంటే కూల్చివేసిన చోటనే వెంటనే వైఎస్సార్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని సూచించారు. వైఎస్సార్ విగ్రహం కూల్చివేత ఘటనను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని సత్య సాయినాథ్ శర్మ స్పష్టం చేశారు.



# శ్రీ జగన్నాథ రథయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ మన జనప్రగతి జులై 02:** కరీంనగర్ నగరంలో ఈ నెల 16వ తేదీ, గురువారం నిర్వహించనున్న శ్రీ జగన్నాథ రథయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ, కరీంనగర్ ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ జగన్నాథ రథయాత్ర నగరంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పెంపొందించే మహత్తర కార్యక్రమమని పేర్కొన్నారు.జులై 16వ తేదీ మధ్యాహ్నం 1 గంటలకు మహాశక్తి టెంపుల్ వద్ద ప్రారంభమయ్యే ఈ పవిత్ర రథయాత్ర వైశ్య భవన్ వరకు ఘనంగా కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, భజనలు, కీర్తనలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు పాల్గొనే ఈ రథయాత్రలో ఈ ఏడాది కూడా కరీంనగర్ నగరంలోని 66 డివిజన్ల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మేయర్ పిలుపునిచ్చారు. నగర ప్రజలందరూ సకుటుంబ సమేతంగా విచ్చేసి శ్రీ జగన్నాథ స్వామివారి రథాన్ని లాగి వారి దివ్య ఆశీర్వాదాలను పొందాలని కోరారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ నరహరి ప్రభు జీ ,కో ఆప్షన్ సభ్యులు కన్న కృష్ణ,డాక్టర్ ఎల్ రాజభాస్కర్ రెడ్డి, కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, తుమ్మల రమేష్ రెడ్డి, కొమురవెల్లి వెంకటేశంలు పాల్గొన్నారు

# ఈఎఫ్‌ల డిజిటైజేషన్ పరిశీలించిన సబ్-కలెక్టర్ అజయ్ యాదవ్



**తల్లాడ,మన జనప్రగతి జులై 02:**తల్లాడ మండలంలోని కుర్ణవల్లి గ్రామంలో జరుగుతున్న ఎన్యూమరేషన్ ఫారమ్‌ల డిజిటైజేషన్ ప్రక్రియను కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఐఏఎస్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామ పరిధిలోని పోలింగ్ స్టేషన్లు నెం. 53, 54, 55, 56ల్లో జరుగుతున్న డిజిటైజేషన్ పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. డిజిటైజేషన్ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశిం చారు. ప్రతి ఎన్యూమరేషన్ ఫారమ్‌లోని వివరాలను క్షుణ్ణంగా నమోదు చేసి, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవం తంగా పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు.

# చివరి లబ్ధిదారుని వరకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం

**- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**

**కరీంనగర్ మన జనప్రగతి జులై 02:** రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికి చివరి లబ్ధిదారుని వరకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే లక్ష్యంతో ముందుకు సాగుతోందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు.కరీంనగర్ నగరంలోని 25వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇల్లు పొందిన లబ్ధిదారుడి నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని గృహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం ఇప్పటికే రెండవ విడతలో కూడా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, ఆ మంజూర్లతో కలిపి కరీంనగర్ నియోజకవర్గంలో ఇంకా సుమారు 3 వేల మంది అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేసే అవకాశం ఉందని తెలిపారు.పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇందిరమ్మ గృహ పథకం ద్వారా వేలాది కుటుంబాలు శాశ్వత నివాసం పొందుతున్నాయని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
03 - 07 - 2026

# వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసంపై భగ్గుమన్న జమ్మలమడుగు

**వైసిపి భారీ నిరసన ర్యాలీ**


**కూటమి నేతల ఫ్రస్ట్రేషన్ వల్లే ఈ పిరికిపంద చర్య**

**అన్నం పెట్టిన చేతిని నరుకుతున్నారు**

**ఆదినారాయణ రెడ్డి కుటుంబానికి ప్రజలే బుద్ధి చెప్తారు: ఎంపీ అవినాష్ రెడ్డి**







**జమ్మలమడుగు మన జనప్రగతి జులై 02:** జమ్మలమడుగు రూరల్ దేవగుడి గ్రామంలో అర్ధరాత్రి సమయంలో మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని కూటమి నాయకులు మూడు ముక్కలుగా ధ్వంసం చేయడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి,ఆయన అబ్బాయ్ భూపేష్ రెడ్డి ఆదేశాల మేరకే ఈ దారుణానికి ఒడిగట్టారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.ఈ ఘటనకు నిరసనగా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, మ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో వైఎస్ఆర్సిపి జిల్లా నాయకులు,కార్యకర్తలు జమ్మలమడుగులో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. "జోహార్ వైఎస్ఆర్" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ, పట్టణ వీధుల గుండా జమ్మలమడుగు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను డిమాండ్ చేస్తూ వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన వెన్నుపోటు దినోత్సవం కార్యక్రమానికి ప్రజల నుంచి లభించిన అపూర్వ స్పందనను తట్టుకోలేక తీవ్ర ఫ్రస్ట్రేషన్‌లో అధికార పార్టీ నాయకులు ఆదినారాయణ రెడ్డి,భూపేష్ రెడ్డి వారి అనుచరులతో కలిసి ఈ పిరికిపంద చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు.గతంలో ఈ వైఎస్ఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసింది స్వయంగా భూపేష్ రెడ్డి తండ్రి దేవగుడి నారాయణ రెడ్డి గారేనని గుర్తు చేశారు. ఆదినారాయణ రెడ్డి కుటుంబానికి రాజకీయ భిక్ష పెట్టిన మహానేత విగ్రహాన్ని వారే ధ్వంసం చేయడం అంటే అన్నం పెట్టిన చేతిని నరకడమేనని విమర్శించారు.పదవులు,అధికారం ఉన్నాయని నోటికొచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోమని,ప్రజలు మరియు దేవుడు ఖచ్చితంగా సరైన సమయంలో వారికి బుద్ధి చెప్తారని అవినాష్ రెడ్డి హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో వైఎస్ఆర్సిపికి చెందిన పలువురు ముఖ్య నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ప్రొద్దటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి,బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా,మాజీ ఉపముఖ్యమంత్రి / మంత్రివర్యులు అంజాద్ బాషా,నియోజకవర్గ పరిశీలకులు పోరెడ్డి నరసింహ రెడ్డి,ఎస్ఈసి మెంబర్ గిరిధర్ వీరితో పాటు వైఎస్ఆర్సిపి శ్రేణులు,వైఎస్ఆర్ అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు..

# నిజాయితీకి ఘన సత్కారం

- రామాంజయ రెడ్డికి శాలువాతో సన్మానం
- పోగొట్టుకున్న బంగారం,నగదు బ్యాగ్‌ను యజమానులకు అప్పగింత
- మానవతా సంస్థ నూతన అధ్యక్షుడు కృష్ణారెడ్డికి అభినందనలు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 02 :** ఒక కుటుంబం పోగొట్టుకున్న బంగారం,నగదు ఉన్న బ్యాగ్‌ను నిజాయితీగా భద్రపరచి, యజమానులకు సురక్షితంగా అప్పగించిన రామాంజయ రెడ్డికి స్థానికంగా ఘన సన్మానం నిర్వహించారు. ఆయన చూపిన నిజాయితీ, సామాజిక బాధ్యతను కొనియాడుతూ పలువురు ప్రముఖులు శాలువా కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో యోగ గురువులు వెంకటరామిరెడ్డి,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధు సూదన్ రెడ్డి,నాగరాజు,హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున రెడ్డి, మానవతా సంస్థ ప్రతినిధులు కృష్ణారెడ్డి, కొండారెడ్డి, కోతమిషన్ కృష్ణారెడ్డి తదితరులు,యోగ సభ్యులు పాల్గొన్నారు.ఈ సంద ర్భంగా పలువురు మాట్లాడుతూ, రామాంజయ రెడ్డి ప్రదర్శించిన నిజాయితీ,మానవతా విలువలు సమాజానికి ఆదర్శప్రాయమని కొనియాడారు.నేటి సమాజంలో ఇలాంటి వ్యక్తులు యువతకు స్ఫూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు.ఇదే కార్యక్రమంలో మానవతా సంస్థ నూతన అధ్యక్షుడిగా ఎంపికైన కృష్ణారెడ్డిని యోగ గురువు వెంకటరామిరె డ్డి,తూగట్ల మధు శాలువాతో సత్కరించి అభినందించారు. ఆయన నాయకత్వంలో మానవతా సంస్థ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు.

# ఓటరు జాబితా పారదర్శకతకే ప్రత్యేక సర్వే

**ఒక వ్యక్తికి ఒకే ఓటు, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు: ఆర్డీఓ చిన్నయ్య హెచ్చరిక**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 02:**–ఓటరు జాబితా పారదర్శకత,ప్రత్యేక సర్వే ఓటరు జాబితా స్వచ్ఛత మరియు ఖచ్చితత్వాన్ని పరిరక్షించేందుకు నిబంధనలు కఠినంగా అమలు చేస్తున్నట్లు పులివెందుల డివిజన్ అధికారి చిన్నయ్య పేర్కొన్నారు.గురువారం ఎర్రగుడిపల్లి 15వ వార్డులో ఆర్డీవో చిన్నయ్య ఆధ్వర్యంలో విఆర్ఓ మరియు బిఎల్ఓ వార్డ్ మాజీ కౌన్సిలర్,పురుషోత్తం వైసిపి నాయకులు కోలా భాస్కర్ తో కలిసి 133.134. బూతు ఓటర్ల సర్వే నిర్వహించారు.చిన్నయ్య మాట్లాడుతూ ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటరుగా నమోదు కావడానికి అర్హుడు కారని ఓటర్లు బిఎల్ఓ లకు సహకరించి తమ ఓటును సంరక్షించుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది మరియు ఆ ప్రాంత ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బాలికల గురుకుల పాఠశాలలో ఎమ్మెల్సీ ఆకస్మిక తనిఖీ

- కుళ్ళిన కూరగాయలు,మెనూ ఉల్లంఘనలపై తీవ్ర ఆగ్రహం
- విద్యార్థుల ఆరోగ్యపై రాజీ పడొద్దు
- శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి



**కడప మన జనప్రగతి జులై 02:** చిన్నచౌక్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.హాస్టల్ వంటగదిని స్వయంగా పరిశీలించిన ఆయన అక్కడ విద్యార్థినుల భోజనం కోసం నిల్వ ఉంచిన కుళ్ళిపోయిన వంకాయలు,కుళ్ళిన పచ్చిమిరపకాయలు,నాణ్యత లేని గోంగూరను చూసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.పశువులు కూడా తినడానికి వీల్లేని ఇటువంటి అధ్వానమైన కూరగాయలతో విద్యార్థినులకు వంటలు ఎలా వండుతున్నారని వంట సిబ్బందిని,వార్డెన్‌ను అక్కడికక్కడే నిలదీశారు.ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థినులకు ఉదయం 6:30 గంటలకే పాలు,కోడిగుడ్లు అందించాల్సి ఉండగా వాటిని ఇవ్వకుండా ఎందుకు ఎగ్గొడుతున్నారని ఎమ్మెల్సీ ప్రశ్నించారు.తాము తనిఖీకి వస్తున్నామని తెలిసి అప్పటికప్పుడు పాలు వేడి చేయడంపై ఆయన మండిపడ్డారు.విద్యార్థినులు సైతం తమకు సక్రమంగా పాలు,గుడ్లు ఇవ్వడం లేదని అడిగితే మధ్యాహ్నం లేదా రాత్రి ఇస్తామని దాటవేస్తున్నారని భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఎదుట వాపోయారు.చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యార్థుల కోసం ఇంత ఖర్చు పెడుతుంటే,పిల్లల కడుపులు ఎందుకు కొడుతున్నారని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.హాస్టల్‌కు సప్లై అవుతున్న కోడిగుడ్లు నిర్దేశిత 50 గ్రాముల బరువు లేకుండా చాలా చిన్నవిగా ఉండటాన్ని ఎమ్మెల్సీ గమనించారు.నాణ్యత లేని కూరగాయలు,చిన్న గుడ్లను సరఫరా చేస్తున్న చిన్నచౌక్ కూరగాయల కాంట్రాక్టర్‌ను చరవాణిలో తీవ్రంగా హెచ్చరించారు.నిబంధనల ప్రకారం లేని సరుకులను వెనక్కి పంపకుండా ఎందుకు స్వీకరిస్తున్నారని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు.నిబంధనలు ఉల్లంఘించి విద్యార్థుల ఆరోగ్యాలతో ఆటలాడుతున్న కాంట్రాక్టర్ల బిల్లులను తక్షణమే నిలిపివేయాలని హెడ్ మాస్టర్ మరియు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇకపై మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# జనసేన నియోజకవర్గ కమిటీలో స్థానం కోసం దరఖాస్తు

- బద్వేల్ నియోజకవర్గ కమిటీలో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి
- పార్టీ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని ఇమ్రాన్ వెల్లడి

**పోరుమామిళ్ల మన జనప్రగతి జూలై 02:**–జనసేన పార్టీ బద్వేల్ నియోజకవర్గ కమిటీలో పదవీ బాధ్యతలు చేపట్టేందుకు పోరుమామిళ్లకు చెందిన జనసైనికుడు ఇమ్రాన్ దరఖాస్తు చేసుకున్నారు. కడప నగరంలోని హరిత హోటల్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో జనసేన పార్టీ కడప పార్లమెంట్ జిల్లా, నియోజకవర్గ పరిశీలకుడు చిలకం మధుసూదన్ రెడ్డికి తన దరఖాస్తును అందజేశారు.ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ, పార్టీ తనకు కమిటీలో అవకాశం కల్పిస్తే జనసేన సిద్ధాంతాలు, నియమనిబంధనలకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. బద్వేల్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, అభివృద్ధి కోసం కార్యకర్తలతో కలిసి విస్తృతంగా శ్రమించి పార్టీని ప్రజల్లో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.



# ఉపాధి హామీ పథకంలో కొత్త మార్పులు.. గ్రామీణ కుటుంబాలకు మరింత మేలు



- జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి
- 125 రోజుల పనిదినాలు, రైతులకు అధిక ప్రోత్సాహం
- తిప్పిరెడ్డిపల్లెలో ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డితో కలిసి పనుల ప్రారంభం






**చెన్నూరు మన జనప్రగతి జూలై 02:**–గ్రామీణ పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధి, గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో తీసుకొచ్చిన కొత్త మార్పులు ప్రతి పేద కుటుంబానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు.పెండ్లిమర్రి మండలం తిప్పిరెడ్డిపల్లెలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డితో కలిసి వి.బి.జి.ఆర్.ఏ.ఎం (గ్రామీణ్) కార్యక్రమాన్ని ప్రారంభించి, వరద కాలువ పూడికతీత పనులకు శ్రీకారం చుట్టడంతో పాటు ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన క్యాటిల్ షెడ్‌ను ప్రారంభించి రైతుకు అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఉపాధి పనిదినాలను 100 నుంచి 125 రోజులకు పెంచడం వల్ల ప్రతి కుటుంబానికి అదనంగా సుమారు రూ.10 వేల వరకు ఆదాయం లభిస్తుందన్నారు. గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు రైతులకు తోటల పెంపకానికి 100 శాతం సబ్సిడీ, మూడేళ్లపాటు మొక్కల సంరక్షణ వ్యయాన్ని ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు.పథకం అమలులో పారదర్శకత కోసం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ గ్రామాల అవసరాలకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికలతో పనులు చేపడుతున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి మాట్లాడుతూ...కమలాపురం నియోజకవర్గంలో గత రెండేళ్లలో రూ.120 కోట్ల విలువైన పనులు చేపట్టగా, ఈ ఏడాది రూ.42 కోట్ల నిధులు కేటాయించబడ్డాయని తెలిపారు. గోశాలలు, తోటల పెంపకం, వ్యవసాయ రహదారులు, నీటి సంరక్షణ పనులు వంటి కొత్త అవకాశాలను రైతులు, ఉపాధి కూలీలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ అదిశేషారెడ్డి, వివిధ శాఖల అధికారులు, రైతులు, మహిళలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174